# ప్రజా తపన

prajathapana.com

*News that matters*



సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 182 మంగళవారం 29 ఆగస్ట్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# ఎన్టీఆర్‌కు అరుదైన గౌరవం

**- శకపురుషుడి పేరుతో రూ.100 నాణెం విడుదల**

**న్యూఢిల్లీ, ఆగస్టు 28**



విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావుకి జాతీయ గుర్తింపు దక్కింది స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ముద్రించిన 100 రూపాయల స్మారక నాణెంను సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అదినేత చంద్రబాబు, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కుటుంబీకులు, సినీ, రాజకీయ రంగ ప్రముఖులు, ఎంపీలు హాజరయ్యారు. నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా మరో అదురై దృశ్యం సాక్షాత్కారమైంది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఎన్టీఆర్ ముఖ చిత్రం ఉన్న వంద రూపాయల నాణేన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం మేరకు నందమూరి కుటుంబ సభ్యులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్‌తో పరిచయం ఉన్న పలువురు ప్రముఖులు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు. షూటింగ్‌లో బిజీగా ఉన్నందున జూనియర్ ఎన్టీఆర్, పాదయాత్రలో ఉన్నందున లోకేష్ హాజరుకాలేదు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ కుమార్తె, ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పురంధేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. సినీ రంగంతో పాటు


02


# 51 వేల మందికి అపాయింట్ మెంట్ లెటర్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 28**



భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి బాటలో పయనిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీని వల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని సోమవారం మోదీ రోజ్‌గార్ మేళాలో ఉపాధి పొందిన వారికి నియామక పత్రాలు ఇచ్చిన సందర్భంగా మాట్లాడుతూ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన 51వేలకు పైగా అపాయింట్‌మెంట్ లెటర్స్ యువతకు పంపిణీ చేశారు. వీరిలో ఎక్కువ మంది భద్రతా దళాలకు చెందిన వారు ఉన్నారు. రోజ్‌గార్ మేళా ద్వారా నియమితులైన వారికి మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామకపత్రాలు అందించారు. వీరిని మోదీ అమృత్ రక్షకులుగా పేర్కొన్నారు. మన దేశ యువతకు కొత్త మార్గాలను అందజేయడం కోసం పారామిలిటరీ బలగాల నియామక ప్రక్రియలో అనేక మార్పులు చేశామని, ఈ దశాబ్దంలో భారతదేశం ప్రపంచంలో మొదటి మూడు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా మారుతుందని అన్నారు. నేను హామీ ఇస్తే, నేను పూర్తి బాధ్యత వహిస్తానని మోదీ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఆటో మొబైల్, ఫార్మా, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు శర వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ రంగాల్లో యువతకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. 2030 నాటికి కేవలం పర్యాటక రంగం మాత్రమే ఆర్థిక వ్యవస్థకు రూ.20 లక్షల కోట్లు కంట్రిబ్యూట్ చేస్తుందని వెల్లడించారు. దాదాపు 13 నుంచి 14 కోట్ల దాకా కొత్త ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. ఆహారం నుంచి ఫార్మాస్యూటికల్స్ వరకు, అంతరిక్షం నుంచి


02


# దొంగ ఓట్లను తీసుకొచ్చింది మీరే....





**తిరుపతి, ఆగస్టు 28**

పిల్లల చదువులు కారణంగా తల్లిదండ్రులు అప్పులు పాలు కాకూడదనే విద్యాదీవెన లాంటి కార్యక్రమం తీసుకొచ్చామన్నారు సీఎం జగన్. చిత్తూరు జిల్లా నగరిలో విద్యాదీవెన పథకం నిధుల విడుదల కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో ఎప్పుడూ చేయని విధంగా తమ హయాంలో పిల్లల చదువుపై ఫోకస్ పెట్టామన్నారు జగన్. విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు సమస్య కాకూడదన్న కారణంతో విద్యా దీవెన పథకాన్ని తీసుకొచ్చి ప్రతి 3నెలలకోసారి డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు సీఎం జగన్. పిల్లల తల్లుల ఖాతాల్లో నేరుగా ఈ డబ్బులు పడుతున్నాయని తెలిపారు. నేరుగా వాళ్లే వెళ్లి కళాశాలల ఫీజులు చెల్లించి తమ పిల్లల చదువులపై ఆరా తీయాలన్నారు. విద్యార్థుల చదువులు సరిగా లేకపోయినా, బోధన బాగోలేకపోయినా, వసతులు సరిపడా లేకపోయినా యాజమాన్యాన్ని నిలదీయాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేస్తే 1902కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డురాకూడదనే ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పథకాలు రూపొందిస్తుందన్నారు జగన్. అలాంటి పథకాల్లో విద్యాదీవెన ఒకటి అని ఇది విద్యార్థుల భవిష్యత్‌ను మార్చే పథకమని అభిప్రాయపడ్డారు. ఈ పథకం ద్వారా నాలుగేళ్లలో 11 వేల 3వందల కోట్ల రూపాయలు అందించామన్నారు. 8 లక్షల 44 వేల 336 మంది లబ్ధిపొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.680 కోట్లు జమ చేసినట్టు చెప్పుకొచ్చారు. నగరి సభలో చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారం కోసం చంద్రబాబు ఏ గడ్డి అయినా తింటారని ఫైర్ అయ్యారు. మూడు సార్లు సీఎంగా

# దుమ్ము రేపిసిన నీరజ్ చోప్రా

**ఆగస్టు 28**




గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ఈసారి స్వర్ణ పతకం సాధించాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈటెను 88.17 మీటర్లు విసిరిన నీరజ్.. పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు. నీరజ్ రెండో ప్రయత్నంలో ఈటెను 88.17 మీటర్లు విసిరగా.. మొత్తం ఆరు ప్రయత్నాల్లో ఈ దూరాన్ని మరో అథ్లెట్ అధిగమించలేకపోయాడు. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 87.82 మీటర్లతో రజత పతకం దక్కించుకోగా.. చెక్ రిపబ్లిక్ అథ్లెట్ జాకుబ్ వాడ్లెచ్ 86.67 మీటర్లతో కాంస్య పతకం సాధించాడు.ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2023లో పాకిస్థాన్ అథ్లెట్ మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో.. భారత దేశంలో ఈ పోరును ఇండో-పాక్ మధ్య యుద్ధంగా భావిస్తారని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం నీరజ్ మాట్లాడుతూ? 'నేను ఏ పోటీకి ముందు అయినా ఎక్కువగా మొబైల్ ఫోన్ వాడను. కానీ ఈ రోజు ఫోన్ చూడగా.. అందులో మొదటగా భారత్ లబ పాకిస్థాన్ అని కనబడింది. అయితే యూరోపియన్ అథ్లెట్లు చాలా ప్రమాదకరం. వారు పెద్ద త్రోను చేయగలరు. అర్షద్ నదీమ్ మాత్రమే కాదు.. జాకుబ్ వాడ్లెచ్, జూలియన్ వెబర్ కూడా ఉన్నారు. చివరి త్రో వరకూ ఇతర త్రోయర్ల గురించి ఆలోచిస్తూ ఉండాలి. అయితే స్వదేశంలో మాత్రం ఈ పోరును భారత్-పాక్ మ్యాచ్‌గా చూశారు' అని తెలిపాడు. త్వరలో ఆరంభం కానున్న ఆసియా క్రీడలు 2023లో నీరజ్, అర్షద్ పోటీ పడనున్నారు. దీనిపై నీరజ్ మాట్లాడుతూ? 'ఆసియా గేమ్స్ 2023లో కూడా భారత్-పాకిస్థాన్ పోరుపై మరింత చర్చ జరుగుతుందని అనుకుంటున్నా. నేను మాత్రం చాలా ప్రశాంతంగా ఉంటా. అథ్లెటిక్స్‌లో భారత్, పాకిస్థాన్ తమ స్థానాలను ఎలా మెరుగుపర్చుకుంటున్నాయో మేం చర్చించాం. ఇక్కడ యూరోపియన్ అథ్లెట్ల ఆధిపత్యం ఉండేది. ఇప్పుడు మేం వారి స్థాయికి చేరుకున్నాం' అని నీరజ్ చెప్పుకొచ్చాడు.



# నాకు పదవులపై ఆసక్తి లేదు

**పాట్నా, ఆగస్టు 28**

లోక్‌సభ ఎన్నికల కోసం అధికార, విపక్షాలు కసరత్తులు మొదలు పెట్టాయి. ఇప్పటికే ఎన్డీయే కూటమిలోని పార్టీలతో వరుస సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఎన్‌డీఏని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా కూటమి కూడా అన్ని విధాలుగా ఢీకొట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రెండు సార్లు ఈ కూటమికి చెందిన పార్టీల కీలక నేతలు సమావేశమయ్యారు. తొలిసారి పట్నాలో, ఆ తరవాత బెంగళూరులో భేటీ అయ్యారు. ఈ సారి ముంబయిలో సమావేశం కానున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలోనే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. కూటమికి పేరైతే పెట్టారు కానీ...ఇప్పటి వరకూ లీడ్ చేసేది ఎవరన్నది ప్రకటించలేదు. మొదటి నుంచి బిహార్


02

# ఎన్టీఆర్‌కు అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ రంగంలోనూ ఎన్‌టీఆర్ విశేష సేవలందించారని అన్నారు. పీలోని రాజకీయాలనే కాకుండా దేశ రాజకీయాలపైనా ఆయన ప్రభావం చూపించారని వెల్లడించారు."సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ ఎన్‌టీఆర్ విశేష సేవలందించారు. ఏపీలోని రాజకీయాలనే కాకుండా దేశ రాజకీయాలపైనా ఆయన ప్రభావం చూపించారు. రాముడు, కృష్ణుడు, శివుడు, దుర్యోధనుడు..ఇలా అన్ని పాత్రల్లోనూ నటించి వైవిధ్యాన్ని చూపించారు. సినిమా సమాజాన్ని ఎలా ప్రభావితం చూపుతుందో నిరూపించారు" రాముడిగానే కాకుండా రావణుడిగా, దుర్యోధనుడిగానూ ఎన్‌టీఆర్ అందరినీ మెప్పించారని కొనియాడారు పురంధేశ్వరి. ఆయన తరతరాలకూ హీరో అని అన్నారు. "ఎన్‌టీఆర్ కేవలం కొంత మందికే హీరో కాదని, తరతరాలకు హీరో. శతజయంతి సందర్భంగా ఆయనను ఇలా స్మరించుకోడం గొప్ప విషయం. ఇప్పటికీ సోషల్ మీడియాలో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన స్మారకంగా రూ.100 నాణెం విడుదల చేయడం చాలా ఉద్వేగమైన క్షణం"- పురంధేశ్వరి, ఏపీ బీజేపీ ప్రెసిడెంట్, ఎన్‌టీఆర్ కూతురు రూ.100 నాణెం విడుదల చేసిన తరవాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎన్‌టీఆర్ సేవల్ని ప్రశంసించారు. ఆయన పేరిట ఇలా ఓ నాణెం విడుదల చేయాలన్న ఆలోచన చాలా గొప్పదని అన్నారు.

"ఎన్‌టీఆర్ పేరిట రూ.100 నాణెం విడుదల చేయాలన్న కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించడం గొప్ప విషయం. పురంధేశ్వరి ఈ ప్రక్రియలో ముందు నుంచి అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. తెలుగు సినిమా ద్వారా దేశ సంస్కృతిని చాటి చెప్పారు. రామాయణ, మహాభారతాలకు ఆయన నటనతో జీవం పోశారు. రాముడు, కృష్ణుడి చరిత్రని అందరికీ చాటి చెప్పారు. ఆయననే రాముడు అనుకునే స్థాయిలో నటించారు"ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి కృష్ణా జిల్లా నిమ్మకూరులో 1923 మే 28న జన్మించిన ఎన్టీఆర్.. స్వయంకృషితో సినీ రాజకీయ రంగాల్లోకి వచ్చి.. తన ప్రత్యేక ముద్రను వేసుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో అత్యున్నత స్థానాన్ని చేరుకుని..ఆ తరువాత తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో తెలుగు దేశం పార్టీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు.ఎన్టీఆర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ నాణేన్ని విడుదల చేసింది. రూ.100 నాణెం 44 మిమీ వ్యాసం కలిగి ఉంది. 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో రూపొందించబడింది. దీన్ని ఏదైనా బ్యాంకులో లేదా రిజర్వ్ బ్యాంక్ కౌంటర్లో కొనుగోలు చేయవచ్చు. ఒక్కో నాణెం ధర రూ. 4,160 ఉంటుంది. నాణెంతో పాటు, తెలుగు ప్రైడ్‌గా పేరొందిన ఎన్టీఆర్




చరిత్రాత్మక జీవిత ప్రయాణాన్ని వివరించే నాలుగు పేజీల పుస్తకాన్ని కూడా కొనుగోలుదారులకు అందించనున్నారు.నాణేనికి ఒకవైపు మూడు సింహాలు, అశోకచక్రం ఉండగా, మరో వైపు హిందీలో హిందీలో 'నందమూరి తారక రామారావు శతజయంతి' అని చెక్కబడిన ఎన్టీఆర్ చిత్రం ఉంది. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను సూచించేందుకు నాణెం 1923-2023 సంవత్సరాలతో గుర్తించబడింది.ఈ నాణాన్ని హైదరాబాదులోని మింట్ కాంపౌండ్‌లోనే ముద్రించబడటం విశేషం. అయితే 100 రూపాయల నాణెం మీద ముద్రించిన ఎన్టీఆర్ బొమ్మలను ఆయన కుటుంబ సభ్యులకే స్వయంగా సెలెక్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. ఔఖీ రూపంతో నాణెం ముద్రించడం పట్ల నందమూరి ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ నాణేన్ని ముద్రించింది. . ఈ నాణేనికి ఓ వైపు మూడు సింహాలతో పాటు అశోక చక్రం ఉండగా మరోవైపు ఎన్టీఆర్ చిత్రం, ఆ చిత్రం కింద నందమూరి తారక రామారావు శతజయంతి అని హిందీ భాషలో ముద్రించారు. ఆయన శతజయంతి ఈ ఏడాదితో ముగిసింది. కనుక 1923- 2023 అని ముద్రితమై ఉంటుందికార్యక్రమానికి తారక్ దూరంనందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా కేంద్రం 100 రూపాయల స్మారక నాణాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నాణాన్ని విడుదల చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను ప్రత్యేకంగా ఆహ్వానించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోపాటుగా నందమూరి కుటుంబ సభ్యులు, ఎన్టీఆర్ సన్నిహితులు, దాదాపు 200 మంది అతిథులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ రెండో భార్య లక్ష్మీపార్వతికి ఆహ్వానం అందలేదని సమాచారం. ఇప్పటికే రాష్ట్రపతి భవన్‌కు చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కూతురు పురందేశ్వరితో పాటుగా ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు సినీ రాజకీయ రంగ ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారని భావించిన జూనియర్ ఎన్టీఆర్ హాజరు కాలేదు.ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా హైదరాబాదులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్‌ను ఆహ్వానించారు కానీ, ఆయన హాజరు కాలేదు. కార్యక్రమంలో తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పాల్గొన్నారు. అంతకుముందు విజయవాడలో నిర్వహించిన ఇదే తరహా కార్యక్రమంలో తారక్‌ను ఆహ్వానించకపోవడంపై అభిమానులు ఆందోళన చేశారు. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న కార్యక్రమంలో దేవర షూటింగ్ కారణంగానే హాజరు కాలేదని చెప్తున్నారు. 2009 ఎన్నికల్లో జూనియర్ ఎన్టీఆర్ టీడీపీ కోసం ప్రచారం చేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తారక్‌కు పార్టీలో ప్రాధాన్యత తగ్గింది. ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో పొత్తు ద్వారా తిరిగి అధికారంలోకి రావాలని టీడీపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో లోకేష్ పాదయాత్ర చంద్రబాబు సభల్లోను తారక్ అభిమానులు ఫ్లెక్సీలు, జెండాలు ప్రదర్శిస్తున్నారు. ఫ్యూచర్ సీఎం అంటూ నినాదాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ నాణెం ఆవిష్కరణ కార్యక్రమానికి తారక్ హాజరు కాకపోవటం వెనుక సినిమా షూటింగ్ మాత్రమే కారణమా, లేక కొంతకాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలే అసలు కారణమా అనే చర్చ ఇప్పుడు సినీ, పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది. తాతపై ఎంతో అభిమానం ఉన్న తారక్.. శతజయంతి సందర్భంగా నిర్వహించిన, నిర్వహిస్తున్న కార్యక్రమాలకు దూరంగా ఉండడం చాలా మందికి నచ్చడం లేదు.

## 51 వేల మందికి అపాయింట్ మెంట్ లెటర్స్

(మొదటిపేజీ తరువాయి)

స్టార్టప్‌ల వరకు అన్ని రంగాలు వృద్ధి చెందితేనే భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రూ.4 లక్షల కోట్ల విలువైన ఫార్మా రంగం 2030 నాటికి రూ.10 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన ఫార్మా పరిశ్రమను ఉదాహరణగా చూపించి వెల్లడించారు. దీని ప్రకారం, దశాబ్ద కాలంలో ఫార్మా పరిశ్రమకు యువత అవసరం ఎంతో ఉందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆటోమొబైల్ రంగం కూడా వేగంగా వృద్ధి చెందుతుందని దానిని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు యువ శక్తి అవసరం చాలా ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలోనూ అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌ను ఉదాహరణగా చూపిస్తూ, రాష్ట్రంలో సుపరిపాలన కారణంగా చట్టబద్ధమైన పాలనను స్థాపించడానికి దారితీసిందని, ఇది చాలా పెట్టుబడులను తీసుకువచ్చిందని మోదీ వెల్లడించారు. రాష్ట్రంలో భద్రతాయుతమైన వాతావరణం ఉంటేనే చట్టబద్ధమైన పాలనను అమలు చేయడం, అభివృద్ధిని వేగవంతం చేయడం సాధ్యమవుతుందని అన్నారు. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతుందని, పెట్టుబడులను కూడా తీసుకువస్తుందని అన్నారు. నేరాల రేటు పెరుగుతున్న రాష్ట్రాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని మోదీ స్పష్టంచేశారు. అనంతరం మోదీ జన్‌ధన్ యోజన గురించి ప్రస్తావించారు. తొమ్మిదేళ్ల క్రితం ఈ రోజున జన్‌ధన్ యోజన ప్రారంభించినట్లు చెప్పారు. ఈ పథకం ఆర్థిక ప్రయోజనాలతో పాటు ఉద్యోగ కల్పనలో కీలక పాత్రం పోషించిందని ప్రధాన మంత్రి వెల్లడించారు.

## దొంగ ఓట్లను తీసుకొచ్చింది మీరే....

(మొదటిపేజీ తరువాయి)

పని చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకు రాదన్నారు. ఆయనకు సొంతకుమారుడిపై నమ్మకం లేదని అందుకే దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకొని అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేస్తానని ఢిల్లీ వెళ్లారని... ఆయనే దొంగ ఓట్లు సృష్టించి ఆయనే ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు జగన్. చంద్రబాబు జీవితమంతా వెన్నుపోట్లు, అబద్ధాలు, మోసాలు, కుతంత్రలేనన్నారు. అంగళ్లులో కార్యకర్తలను రెచ్చగొట్టి గొడవల సృష్టించి లబ్ధి పొందాలని చూశారన్నారు. పోలీసులపై దాడులు చేయించాలని ఓ పోలీసు కన్ను కూడా పోయిందన్నవారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన ఫొటోకే దండ వేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు నాణెం విడుదల కార్యక్రమంలో కూడా పాల్గొన్నారని ఎద్దేవా చేశారు.

## నాకు పదవులపై ఆసక్తి లేదు

ముఖ్యమంత్రి నితీష్

(మొదటిపేజీ తరువాయి)

కుమార్ పేరే వినిపిస్తోంది. ఆయనే ఇండియా కూటమికి కన్వీనర్‌గా ఉంటారని చాలా మంది నేతలు చెప్పారు. దీనిపై నితీష్ కుమార్ స్పందించారు. మీడియా అడిగిన ప్రశ్నకి సమాధానమిచ్చారు. తనకు ఏ పదవిపైనా ఆసక్తి లేదని, కేవలం అన్ని పార్టీలను ఒకేతాటిపైకి తీసుకురావడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. "నాకు ఏ పదవిపైనా ఆసక్తి లేదు. ఇదే విషయాన్ని నేను గతంలోనూ చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నాను. నాకు కన్వీనర్ పదవిపై ఏ మాత్రం ఆసక్తి లేదు. కేవలం అన్ని పార్టీలను కలపడమే నా పని. అదే నా లక్ష్యం" ముంబయిలో జరగనున్న భేటీకి తాను హాజరవుతానని, కూటమి నుంచి ఏమీ ఆశించడం లేదని స్పష్టం చేశారు. నితీష్ కుమార్ ప్రధాని అభ్యర్థి అంటూ ప్రచారం జరిగింది. దీనిపై ఆయన గట్టిగానే స్పందించారు. అలాంటి ఉద్దేశమే లేదని తేల్చి చెప్పారు. ఆగస్టు 31న జరగనున్న విపక్ష కూటమి భేటీలోనే ఇండియా లోగోని ఆవిష్కరించనున్నారు. కూటమి పేరు కలిసొచ్చేలా ఓ లోగో తయారు చేసినట్టు సమాచారం. ఇదే సమయంలో ఈ కూటమికి సంబంధించిన కో ఆర్డినేషన్ కమిటీలోని 11 మంది సభ్యుల పేర్లనూ ఈ సమావేశంలోనే ఖరారు చేస్తారని తెలుస్తోంది. కానీ...దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. భారత దేశ స్ఫూర్తికి నిదర్శనంగా ఈ లోగో ఉండనుందని కొందరు నేతలు చెబుతున్నారు.

## రాహుల్ ప్రధానిపై బీజేపీ సెటైర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28**

కార్టూన్‌తో సెటైర్లు రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి అని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోట్ ప్రకటించారు. దీనిపై ఇప్పటికే చర్చ మొదలు కాగా...బీజేపీ కౌంటర్‌లతో విరుచుకు పడుతోంది. ట్విటర్ వేదికగా ఓ సెటైరికల్ పోస్ట్‌తో రాహుల్‌పై విమర్శలు చేసింది. ఓ కార్టూన్‌తో కౌంటర్ ఇచ్చింది. అందులో రాహుల్ గాంధీ ప్లేన్ నడుపుతున్నారు. "టికెట్ టూ డిజాస్టర్" అని క్యాప్షన్ ఇచ్చింది బీజేపీ. ఇప్పటికే రాహుల్ గాంధీపై విమర్శల డోస్ పెంచిన కాషాయ పార్టీ...అవకాశం దొరికిన ప్రతిసారీ గట్టిగానే స్పందిస్తోంది. రాహుల్ పదేపదే ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడం బీజేపీని అసహనానికి గురి చేస్తోంది. ఇటీవల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ స్పీచ్ కూడా హైలైట్ అయింది. దానికి ప్రధాని మోదీ ఇచ్చిన కౌంటర్‌లు కూడా బాగానే పేలాయి. అప్పటి నుంచి రాహుల్ వర్సెస్ మోదీ మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే రాహుల్‌ని ప్రధాని అభ్యర్థిగా గహ్లోట్ ప్రకటించడంపై బీజేపీ ఇలా స్పందిస్తోంది. కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ నిలబడతారన్న ఊహాగానాలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. అయితే...చాలా సందర్భాల్లో పలువురు నేతలు దీన్ని కొట్టిపారేశారు. రాహుల్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేసుకోడం లేదని తేల్చి చెప్పారు. కానీ..రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోట్ మాత్రం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి గురించి ప్రస్తావిస్తూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ రేసులో ఉంటారని




తేల్చి చెప్పారు. ఎన్నో చర్చల తరవాత ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల ఆధారంగానే విపక్షాలన్నీ కలిసి కూటమి కట్టాల్సి వచ్చిందని, ఇది ప్రజలు కోరుకున్నదే అని అన్నారు గహ్లోట్. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ వైఖరినీ ఖండించారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన చాలా గర్వంగా కనిపిస్తున్నారని, కేవలం 31%ఓట్లతోనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. మిగతా 69% మంది మోదీ సర్కార్‌కి వ్యతిరేకంగానే ఉన్నారని చెప్పారు. బెంగళూరులో గత నెల విపక్షాలు భేటీ అవడం చూసి ఎన్డీయే భయపడిపోయిందని సెటైర్లు వేశారు. 50% ఓట్లు రాబట్టుకునేందుకు ఎన్డీయే కృషి చేస్తోందన్న అంశంపైనా స్పందించారు. "ప్రధాని నరేంద్ర మోదీ 50% ఓట్లు సాధించడం ఎప్పటికీ జరగదు. ఆయన చరిష్మా ఎక్కువగా ఉన్నప్పుడే ఇది సాధ్యం కాలేదు. వచ్చే ఎన్నికల్లో అయితే ఎలాగో అది జరగదు. ఆయన ఓటు షేర్ కచ్చితంగా తగ్గుతుంది. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చాకే అదే అర్థమవుతుంది. ఆ ఎన్నికలే తదుపరి దేశ ప్రధాని ఎవరన్నది డిసైడ్ చేస్తుదని అన్నారు.

# వైఆకాపా హయాంలో సహజ వనరుల దోపిడీ

**శ్రీకాకుళం**

రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న ఇసుక దోపిడీపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నోరు విప్పాలని, సంబంధిత బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మరియు టిడిపి నాయకులు నిరసన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని వాపోయారు. జేపీ వెంచర్స్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుని,ఇసుక రీచ్ ల నిర్వహణ అన్నది సంబంధిత సంస్థకు అప్పగించిందని, ఇప్పుడు కాల పరిమితి ముగిసినా నిబంధనలు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఇవాళ బట్టేరు ఇసుక రీచ్ ను సందర్శించారు. స్థానికులను కలిసి పలు సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతం అంతా ఎడారిని తలపిస్తుందని. నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న ఇసుక రీచ్ లో అధికారుల పర్యవేక్షణ కొరవడుతుందని ఆవేదన చెందారు. ఇక్కడ భారీ వాహనాల రాక కారణంగా సమీప రోడ్లు అన్నీ ఛిద్రం అవుతున్నాయని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పరిసర ప్రాంత ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని, నదీ గర్భం కోతకు గురి అవుతుందని వాపోయారు. ఒకే బిల్లు పై పలు వాహనాలతో ఇసుక తరలించుకు పోవడం నిబంధనలకు విరుద్ధం అని,తద్వారా ప్రభుత్వానికి ఆదాయానికి గండి పడుతోందని అన్నారు. స్థానిక వైసీపీ నాయకులకు కాసుల వాన కురిపిస్తున్న ఈ బట్టేరు రీచ్ నిర్వహణ పై కలెక్టర్ స్థాయి వ్యక్తులు నిఘా ఉంచి,నిబంధనలకు తిలోదకాలు వస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎక్కడ చూసిన ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతోందని, అధికారుల కళు గప్పి భారీ వాహనాలతో విశాఖకు పలు ప్రయివేటు కన్ స్ట్రక్షన్ కంపెనీ వాహనాల్లో తరలిపోతోందని ఆరోపించారు. వాస్తవానికి జగనన్న కాలనీల నిర్మాణానికి ఇసుక లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారని, దీంతో ఇళ్ల నిర్మాణం కుంటుపడుతోందని, పేదలకు సొంతింటి కల నెరవేరడం లేదని ఆవేదన చెందారు. కానీ వాస్తవం మాత్రం ఇందుకు విరుద్ధం అని అన్నారు. ఆ రోజు పాదయాత్రలో ఇసుక రీచ్ లను పేదలకు అందుబాటులోకి తెచ్చి, వారికి ఉచితంగా ఇసుక ఇచ్చిన తరువాత మిగతా విషయాలను పరిగణనలోకి తీసుకుంటామని వైఎస్ జగన్ హామీ ఇచ్చిన వైనాన్నీ మరిచిపోయారన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది అని,తమ ప్రభుత్వం లో ఇసుక విధానానికీ, ఈ ప్రభుత్వంలో ఇసుక విధానానికీ ఎంతో తేడా ఉందని, ఇసుక దోపిడీ తప్ప ఏమీ తెలియని విధంగా వైఎస్సార్ సర్కారు విధానాలు నడుస్తున్నాయని ఆవేదన చెందారు. కాసులు దండుకుని వైఎస్సార్ పెద్దలు కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. సహజ వనరుల దోపిడీని తక్షణమే నిలువరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఇసుక రవాణాను అడ్డుకునేందుకు ఎవ్వరైనా ప్రయత్నిస్తే వారిని చంపేస్తామని బెదిరించడమే కాకుండా, కొన్నింట అన్నంత పనీ చేస్తున్నారని, వైసీపీ సర్కారులో ఇసుకాసురుల ఆగాడాలకూ అడ్డూ అదుపూ అన్నది లేనే లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం హయాంలో ఇసుక ను ఉచితంగా నిబంధనల మేరకు అందిస్తే, ఈ ప్రభుత్వం ఎక్కడికక్కడ కార్పొరేట్ కంపెనీలకు ఇసుక రీచ్ లను తాకట్టు పెట్టి, వీటికి కడప గుండాలను రక్షణ దళాలుగా నియమించి దౌర్జన్యం చేస్తోందని ఆరోపించారు. వీటిపై తాము నిరంతరం పోరాడుతున్నామని, ప్రజలంతా తమతో కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రభుత్వ తీరును నిరసించాలని కోరారు. ఇసుకే కాకుండ ప్రకృతి వనరుల పరిరక్షణ అన్నది ఇవాళ లేకుండా పోతోందని దీనికి తార్కాణంగా వైజాగ్ రుషికొండ, పలాస సూదికొండ, నెమలి కొండలు నిలుస్తున్నాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సీర రమణయ్య,రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్,జిల్లా టిడిపి అధికారిక ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఉపాధ్యక్షులు జూఎతీ బాబు, చిట్టి మోహన్, కార్యనిర్వక కార్యదర్శి అరవల రవీంద్ర, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు బలగ చెంగలరావు,జిల్లా ఐటీడీపి కోఆర్డినేటర్ ప్రధాన విజయరాం,జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి,రూరల్ మండలం రైతు సంఘ ప్రధాన కార్యదర్శి బలగ మురళి,నగర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తాలూరి నవీన్,జిల్లా సోషల్ మీడియా బుక్క యుగంధర్,నియోజకవర్గం తెలుగుయువత ప్రధాన కార్యదర్శి రోణీనీకి కళ్యాణ్,ఉపాధ్యక్షులు ముద్దాడ అసిరినాయుడు,టీడీపీ నాయకులు కర్రి అద్దెన్న,కర్రి ప్రదీప్,తెలుగుయువత అధ్యక్షులుమల్ల నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులు ఎండు లక్ష్మణ టీడీపీ నాయకులు బాణా సూర్యనారాయణ బట్ట ప్రసాద్,బగ్గు రామకృష్ణ, నక్క రామకృష్ణ, బైరి రమేష్, టిడిపి నాయులు పాల్గొన్నారు.

# కసాపురం కమ్మ కొట్టాల గ్రామాలలో కబ్జాకు గురైన స్మశాన స్థలాలు

**ఎస్సీ ల స్మశాన వాటిక స్థలాలు కబ్జాకు గురైతే ప్రజా ప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యం**

**గుంతకల్లు మండల పరిధిలో పలు గ్రామాల్లో మనిషి చనిపోతే పూడ్చడానికి ఆరడుగులు స్థలం లేని దుస్థితి**

**కరోనా సమయంలో ఒకే గుంతలో 6 మందిని పూడ్చిన వైనం**

**2.40 లక్షలురూపాయలతో స్మశాన వాటిక ఏర్పాటు చేసిన పిజెఆర్.. హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు.**


**స్మశాన వాటికను సందర్శించిన పి.జె. ఆర్**



**గుంతకల్లు (ప్రజా తపన )ఆగష్టు 27**

తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే స్మశాన వాటికలు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం..... స్మశానవాటికలు లేని గ్రామాలలో... స్థలాలు కేటాయించి స్మశాన వాటిక ఏర్పాటు చేస్తాం.. టిడిపి సీనియర్ నేత పి జె ఆర్ భరోసా ఇచ్చారు. అలాగే అయన మాట్లాడుతూ ప్రతి మనిషికి చివరి మజిలీ అయిన స్మశాన వాటికను సైతం వదలడం లేదు ఆక్రమణ దారులు.! గుంతకల్ నియోజకవర్గ పరిధిలో గ్రామాలలో స్మశాన వాటికలు ఏర్పాటు చెకపోగా..! 100 సంవత్సరాల నుండి ఉన్న స్మశాన వాటికలను ఎమ్మెల్యే అనుచరులు ఆక్రమణలు నిర్వహించారని గుంతకల్ నియోజకవర్గ పిజెఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి ఆరోపించారు.మనిషి మరణం అనంతరం పూడ్చుడానికి ఆరడుగుల నేల కూడా లేదని ఆ గ్రామల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం గ్రామాల పర్యాటనలలో భాగంగా పామిడి మండల పరిధిలో దిబ్బసానిపల్లి గ్రామం చేరుకున్నారు.. అనంతరం ఈ గ్రామం నందు స్మశాన వాటిక లేదని గ్రామస్థులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి నీ సంప్రదించగా స్మశాన వాటిక కోసం 2.40 లక్షల రూపాయలు విలువ గల భూమిని కొనుగోలు చేసి స్మశాన వాటిక ఏర్పాటు చేసిన సంఘటన గుర్తు చేస్తూ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మనిషి చనిపోతే ముట్టుకోవడానికి కూడా దగ్గరికి వెళ్లలేని దుస్థితి మరణించిన వారిని పూడ్చుడానికి స్థలం లేక ఒకే గుంతలో 6 మందిని పూడ్చిన వైనం అప్పుడు ఆ సమయంలో జీవానంద రెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్మశాన వాటిక ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందని గ్రామస్థులు జీవానంద రెడ్డిని కొనియాడారు. ఆ స్మశాన వాటికను పెరుమాళ్ళ జీవానంద రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా,ప్రతినిధులు,అధికారులు స్మశాన వాటికలు ఏర్పాటు చెయ్యలేదని ఎద్దేవా చేశారు.స్మశాన వాటికలకు భూమిని కేటాయించక పోగా కసాపురం,కమ్మ కొట్టాల గ్రామాలలో ఎమ్మెల్యే అనుచరులు స్మశాన వాటికలు ఆక్రమణలు చేస్తున్నారని .స్థానిక ఎమ్మెల్యే ఎస్సీలపై కపట ప్రేమ అని కొనియాడారు .అదేవిధంగా ఎమ్మెల్యే అండ లేకుండానే అధికారుల అండ లేకుండా కబ్జా చేస్తారా..? అని అన్నారు. మరణించిన వ్యక్తి నీ గుర్తు చేసుకుంటూ సంవత్సరికం చేస్తారన్నారు, తాతలు ముత్తాతలు అని చెప్పుకోవడానికి కూడా లేకుండా స్మశాన వాటికలు కబ్జాలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే స్మశాన వాటికలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామని గ్రామస్థులకు ఆయన భరోసా ఇచ్చారు..! స్మశాన వాటికలు లేని గ్రామాలలో స్థలాలు కేటాయించి స్మశాన వాటిక ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దిబ్బసాని పల్లి గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పి జే ఆర్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు మహిళలు ఆధ్వర్యంలో మేనిఫెస్టో కరపత్రాలువిడుదల



**గుత్తి ( ప్రజా తపన )ఆగష్టు 28**

మండల పరిధిలో ఊబిచర్ల గ్రామం నందు సోమవారం మహా శక్తి కార్యక్రమం భాగంగా తెలుగు మహిళలు ఆధ్వర్యంలో మన అధినేత చంద్రబాబు మహిళల కోసం ప్రకటించిన పథకాలను యువ నాయకులు విష్ణు తేజ్ గౌడ్ గుత్తి మండల కన్వీనర్ బర్దివలి గ్రామం లో ఇంటింటికి తిరిగి మినీ మేనిఫెస్టో ను కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం లో పథకాలను సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు జిల్లా వ్యాప్తంగా మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం మరియు 18 సంవత్సరములు నిండిన ప్రతి ఆడబిడ్డకు 1500 రూపాయలు ఇంట్లో చదువుకున్న ప్రతి పిల్లవానికి 15000 రూపాయలు ఎంత మంది ఉన్నా అందరికీ వర్తించే విధంగా మరియు మహిళలకు రక్షణ చట్టం మరియు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు మరియు రైతులకు 20 వేల రూపాయలు సంవత్సరానికి ఇలా భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలు, జగన్ రెడ్డి చేస్తున్న అరాచకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరిస్తూ, మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు పార్లమెంట్ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు తలారి సరోజమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి,సభ్యురాలు లీలావతి ,నియోజకవర్గ అధ్యక్షురాలు అంజలిదేవి , సభ్యురాలు లక్ష్మి, 28వ వార్డు ఇంచార్జ్ జయమ్మ, మాధవి,వల్లే లక్ష్మి దేవి, రాజేశ్వరి, గ్రామ తెలుగు మహిళలు :ఫజులు,మహమ్మద్ అలీ, సుధాకర్,రామకృష్ణ గౌడ్, పెద్ద రంగడు, పరశురాముడు, మద్దిలేటి స్వామి, సుధాకర్, మనోహర్, శేషు,గోవిందు, వెంకటేశు, గంగాధర్, చలపతి, కంబగిరి, నారప్ప, గ్రామ, గుత్తి మండలం తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# వ్యావహారిక భాషోద్యమానికి ఊతం గిడుగు

**విజయవాడ, (ప్రజా తపన )ఆగష్టు 27**




ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం మరియు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికారసంస్థ,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆంధ్రవిశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు గారి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో తెలుగు భాషా వారోత్సవాలు లలో భాగంగా గిడుగు రామమూర్తి జీవితం రచనలు సమాలోచన అనే అంశం పై వివిధ కళాశాలల నుండి ,నగరం లో ని ప్రముఖ సాహితీ సంస్థల ప్రతినిధులచే సమావేశాలు నిర్వహిం చబడ్డాయి. మొదటి సమావేశానికి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ఆచార్య జి యోహాన్ బాబు,ఆచార్య వెలమల సిమ్మన్న ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు.ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సమాజానికి ముగ్గురు మహనీయులు మహోన్నత సేవచేసి తరించారని కందుకూరి ,గురజాడ, గిడుగు లు త్రివేణి సంగమం వలే తెలుగు నేలను తెలుగు భాషను ప్రక్షాళన చేశారన్నారు .కందుకూరి సంఘ సంస్కరణకు పూనుకుంటే గురజాడ ఆధునిక సరళ సాహిత్య భాషకు పునాదులు వేశారని గిడుగు ప్రజల వ్యావహారిక భాషోద్యమానికి ఊతంగా నిలిచి సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని అందుకొని తెలుగు భాషామ తల్లి ముద్దుబిడ్డగా పేరుపొందారన్నారు. తెలుగు వెలుగు నింపిన గిడుగు వారసత్వాన్ని నేడు ప్రతి వ్యక్తి హృదయంలో నిలుపుకోవాలన్నారు .ఈ కార్యక్రమం లో డా బూసి వెంకటస్వామి , డా నేమాని శారద ,శ్రీ శేఖరమంత్రి ప్రభాకర్ ,డా పి గోపాలనాయుడు ,డా యస్ పోలయ్య ,డా మారడాన సుబ్బారావు ,శ్రీ జె పి శర్మ ,డా దామెర వెంకట సూర్యారావు ,డా పెండ్యాల లావణ్య ,డా కె రత్నశేఖర్ ,డా ఏ వెంకటేశ్వర్లు,స్నాతకోత్తర విద్యార్థులు ,పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# జన విజ్ఞాన వేదిక మండల నూతన కమిటీ ఎంపిక



**గుత్తి ( ప్రజా తపన )ఆగష్టు 27**

మండల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఆర్ అండ్ బి అతిథి గృహము నందు మండల జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఎంపికైంది. డాక్టర్ రంగన్న అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా దేశాయి నాగరాజు, వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులుగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగారమేష్, నిజాం, కాశి రావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా, కోటేశ్వరరావు, రామదాస్, రంగనాథ్, సలహాదారులు విశ్రాంత ఉపాధ్యాయులు జన్నే కుల్లాయి బాబు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు, సైన్స్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# “విశిష్టంగా తెలుగు భాషాదినోత్సవం”

**(ప్రజా తపన )ఆగష్టు 27**







“తెలుగు భాషోధ్యమ పితామహులై”న గిడుగు రామమూర్తి పంతులు గారి 160వ జయంతిని పురస్కరించుకుని “ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం”తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా విహపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ...
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఔన్నత్యాన్ని దశదిశలా చాటడానికి విశేషంగా ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఒక గొప్ప ఆకర కేంద్రంగా ఇది రూపాంతరం చెందాలి ఉద్ఘాటించారు. గిడుగు రామ్మూర్తి గారి మరో కోణమైన భాషోధ్యమ విశిష్టతను సోదాహరణంగా వివరించారు. చాలా ప్రాచీన గ్రంథాల్ని డిజిటలైజ్ చేయాలని అందులో ఈ కేంద్రం ఉన్నంతగా పనిచేయాలని తెలిపారు. తదనంతరం చిత్రకవిత్వం మీద విశేషంగా కృషిచేసిన అలంకారం రమణరాజు గారిని సత్కరించి వారి “చిత్రకవితా సౌరభం” అనే పుస్తకాన్ని సభాముఖంగా ఆవిష్కరించారు. ఈ సమావేశానికి విశిష్ట వక్తలుగా హాజరైన డా.జి.వి. పూర్ణచంద్, శ్రీ ఉన్నం జ్యోతి వాసు, డా. శ్రీనివాస తేజ, డా. కరుణ శ్రీ మొదలైన వారు “వాడుక భాషా ఔన్నత్యాన్ని, గిడుగువారి భాషా వైశిష్ట్యాన్ని గురించి విశేషంగా ప్రసంగించారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ “ గిడుగు వారి పుస్తకాల నేపథ్యాల్ని, భాషోధ్యమ పుట్టుపూర్వోత్తరాల్ని సంక్షిప్తంగా తెలియజేసి” సభాసదులను చైతన్య పరిచి, ఈ సంస్థ భవిష్యత్తు లక్ష్య,గమ్యాల గురించి పేర్కొన్నారు. ఈ భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని డి.కె. డబ్ల్యూ కళాశాల విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాల్ని అందించారు. కార్యక్రమానికి నెల్లూరులోని కవులు, రచయితలు, అధ్యాపకులు, భాషాభిమానులు, విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక, కార్యనిర్వహక సిబ్బంది హాజరై విజయవంతం చేశారు.

# కౌన్సెలింగ్ తేదీలు ఖరారు

**విజయవాడ, ఆగస్టు 28:**

విద్యాసంవత్సరానికి సంబంధించి పలు ప్రవేశ పరీక్షల కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ఏపీ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఏపీ ఉన్నత విద్యామండలి వివిధ సెట్స్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించింది. 2023-24 విద్యా సంవత్సరానికి పలు సెట్స్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ తేదీలను ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంటెక్, ఎంఫార్మసీల్లో అడ్మిషన్ల కోసం పీజీ ఈసెట్ కు వచ్చే నెల 10వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఐసెట్ కౌన్సెలింగ్ ను సెప్టెంబర్ 6వ తేదీ నుంచి, పీజీ కోర్సులకు ప్రవేశాలు కల్పించే పీజీ సెట్ కౌన్సెలింగ్ ను సెప్టెంబర్ 11వ తేదీ నుంచి నిర్వహిస్తామని తెలిపారు. బీపీఈడీ, యూజీడీ, పీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే పీఈసెట్‌కు సెప్టెంబర్ 17వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే లాసెట్ కు సెప్టెంబర్ 26న కౌన్సెలింగ్ జరగనుంది. బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల ఎడ్‌సెట్ కు సెప్టెంబర్ 30వ తేదీ నుంచి, ఏపీ ఈఏపీ సెట్ లో నాన్ ఎన్ఆర్ఐ, క్యాట్ బీ, ఇంజినీరింగ్ కోర్సులకు ఇవాళ్టి నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ తెలిపారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్

ఐసెట్ - సెప్టెంబర్ 6(ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్లు)

పీజీ ఈసెట్ - సెప్టెంబర్ 10 (ఎంటెక్, ఎంఫార్మసీల్లో అడ్మిషన్లు)

పీజీ సెట్ -సెప్టెంబర్ 11(పీజీ కోర్సులకు ప్రవేశాలు)

పీఈసెట్- సెప్టెంబర్ 17(బీపీఈడీ, యూజీడీ, పీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు)

లాసెట్ - సెప్టెంబర్ 26(3 ఏళ్లు, 5 ఏళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం అడ్మిషన్లు)

ఎడ్‌సెట్ - సెప్టెంబర్ 30(బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు)

# కాలేజీ బస్సుఢీకొని జీహెచ్ఎంసి కార్మికురాలు మృతి

**హైదరాబాద్**



హైదరాబాద్ నగరంలో సోమవారం ఉదయమే విషాద ఘటన చోటుచేసుకుంది. నారాయణ గూడ పోలీసు పరిధిలోని రామ్ కోట్ లో రోడ్లు ఊడుస్తున్న మహిళ సునీత ను ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీ బస్సు ఢికొంది. ఘటన అమె అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొని ఆగిపోయింది. ఘటనలో బస్సులోని నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లోని అయాన్ మెడికల్ కాలేజీకి చెందిన బస్సు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం నేపథ్యంలో అక్కడ భారీ ట్రాఫక్ జాం ఏర్పడింది. బస్సు డ్రైవర్ మహమ్మద గౌస్ పై పోలీసులు కేసు నమోదు చేసారు.

## ఆపరేషన్ చిరుత....

## నాలుగో చిరుత కూడా దొరికింది



**తిరుపతి**
గత కొద్ది రోజులుగా భక్తులకు, అధికారులకు నిద్ర లేకుండ భయపెట్టిన ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి నడక మార్గంలో మరో చిరుత చిక్కింది. ఆదివారం రాత్రి 7వ మైలురాయి వద్ద బోనులో పడింది. ఈ చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు పది రోజులుగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఎర వేయడంతో ఎట్టకేలకు చిరుత చిక్కింది. ఇప్పటివరకు 4 చిరుతలు చిక్కాయి. జూన్ నె 24 న, ఈ నెల 14, 17 న చిరుతలు బోనులో చిక్కాయి. దీంతో శేషాచలకొండలలో ఆపరేషన్ చిరుత ముగిసింది. ఇక నుంచి భక్తులు నడకమార్గంలో ప్రశాంతంగా వెళ్లేందుకు మార్గం సుగమమైంది.

## రామలక్ష్మి కొట్టాలలో కార్డన్ అండ్ సెర్చ్

**అళ్లగడ్డ**
నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణం రామలక్ష్మి కొట్టాలలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు 4:30 గంటలకు ప్రారంభమయిన ఈ కార్యక్రమంలో పత్రాలు సరిగా లేని 42 టూ వీలర్స్, ఒక ట్రాక్టర్, ఒక బొలెరో వాహనం (మహేంద్ర వెహికల్), ఒక బల్లెం స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులుగా ఉన్న ఇద్దరు మట్కా వ్యక్తులను అదుపులోకి తీసుకన్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సీఐలు రమేష్ బాబు, చంద్రబాబు నాయుడు, నారాయణరెడ్డి, హనుమంత్ నాయక్, 8 మంది ఎస్సైలు, వందమంది సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రజల్లో వైకాపా బలంగా వుంది

**విశాఖపట్నం**
విశాఖ తూర్పులోనే కాదు, ఎక్కడైనా నియోజకవర్గ సమన్వయకర్తల మా ర్పు ఉండవచ్చునని వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశా రు.విశాఖ తూర్పు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్ర మంలో పాల్గొన్న అనంతరం మీడియా తో మాట్లాడారు. మా పార్టీ బలంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు.

## రౌడీయిజం చేస్తే తాటతీస్తా...

**సూర్యాపేట**
సూర్యాపేటలో ఎవడయినా రౌడీయిజం చేస్తే తాట తీస్తా అంటూ హెచ్చరించారు సూర్యాపేట శాసన సభ్యులు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి..పరాయి వాళ్ళ భూములు అక్రమిస్తే నా అనుచరులైనా సహించేది లేదన్నారు.అక్రమాలకు పాల్పడితే ఎవడైనా జైలుకే అని వార్నింగ్ ఇచ్చారు .ఇవి పాత రోజులు కావనీ...అన్యాయం పై తిరగబడే రోజులనీ గుర్తుచేశారు.తొమ్మిదిన్నర ఏళ్లుగా సూర్యాపేట ప్రశాంతంగా ఉందన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టం తన పని చేసుకుంటూ వెళ్తుందనీ భూ కబ్జా దారులకు మంత్రి జగదీష్ రెడ్డి సుతి మెత్తని కౌంటరిచ్చారు.

## పాము కాటుతో యువతి మృతి

**మేడ్చల్**
జవహార్ నగర్ లో అఖిల (17) అనే యువతి పాము కాటుతో మృతి చెందింది. విరుగుడు ఇంజక్షన్ అందక యువతి మృతి చెందింది. బాలాజీ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే అక్కడి సిబ్ంది కనీసం యాంటీ వెనమ్ ఇంజక్షన్ ఇవ్వలేదు. పైగా మందులు లేవు వేరే ఆసుపత్రికి తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు. ఆర్మీ డెంటల్ కాలేజీ, భాగ్య నగర్ కాలనీ సమీపంలోని క్రిష్ణపురి కాలనీలో ఘటన జరిగింది. సమయానికి విరుగుడు ఇంజక్షన అందక పోవడంతోనే యువతి మృతి చెందిందని బాధిత కుటుంబికుల ఆవేదన.

## స్పందనలో మహిళ ఆత్మహత్యాయత్నం

**ఏలూరు**
ఏలూరు కలెక్టరేట్ స్పందన వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం దెయ్యం పడు గ్రామానికి చెందిన సైదు బేబీ కుమారి స్పందన వద్ద ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భూ వివాదంపై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన న్యాయం జరగకపోవడంతో మనస్థాపనతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం.

## రెండు కులాలే ఏలుతున్నాయి

**విశాఖపట్నం**
రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు కేటాయించడం లేదని బీజీపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. విభజించి పాలించే సిద్ధాంతాన్ని పాటిస్తున్నా యన్నారు. రెండు కులాలు మాత్రమే అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకుంటున్నాయని ఇది ఎంతమాత్రమూ తగదన్నారు. అన్నికులాలకు రాజకీయ ప్రాధాన్యత కలి?పంచాల్సిన అవసరం ఉందన్నారు.

# వైసీపీ నేతల 100 రోజుల యాత్ర

**నెల్లూరు, ఆగస్టు 28:**

వైసీపీ నేతలందరూ వంద రోజుల పాటు ప్రజల్లో ఉండేలా ప్రత్యేక కార్యక్రమన్ని ఆ పార్టీ హైకమాండ్ రెడీ చేసింది. ప్రస్తుతం పార్టీ పునర్ వ్యవస్థీకరణపై దృష్టికేంద్రీకరించారు. - జిల్లా పార్టీ అధ్యక్షులు, నూతన కార్యవర్గాలను ఎంపికచేశారు. ఈనెలాఖరులోగా మండల కమిటీలను నియమించడం పూర్తి చేయనున్నారు. ఈ కమిటీలు పూర్తి కాగానే ప్రతి జిల్లాలోనూ ఆయా జిల్లా అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లా కార్యవర్గ సభ్యులతో బస్ యాత్రను నిర్వహించాలని నిర్ణయించారు. బస్ యాత్రను కొత్తగా ఎంపిక చేసిన మండల కన్వీనర్లు, కార్యవర్గం వారివారి మండల పరిధిలో ఏఏ గ్రామాల మీదుగా సాగాలన్న దానిపై రోడ్ మ్యాప్ జిల్లా పార్టీకి ఇవ్వనుంది. ఈ సారి బస్ యాత్రలో భాగంగా జిల్లా పార్టీ వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. బస్సు యాత్రతో పాటు ఐప్యాక్ టీం కూడా ఆయా మండలాల్లోని పరిస్థఇతుల్ని విశ్లేషించి రాష్ట్ర పార్టీకి ఒక నివేదిక అందజేస్తుంది. వీటన్నింటినీ క్రోడీకరించిన మీదట ఆ మండలంలో ఏ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలో స్పష్టత రానుంది. జిల్లా పార్టీ బస్ యాత్ర నెల రోజులపాటు జిల్లా మొత్తం పర్యటించి నిత్యం ప్రజల్లో పార్టీ కార్యక్రమాలు ఉండేలా చర్యలు తీసుకుంటోంది. వై ఏపీ నీడ్స్ జగన్ పేరుతో సోషల్ మీడియాలో ఇప్పుడు ప్రచారం చేస్తున్నారు. దీనికి సమాంతరంగా బస్ యాత్ర జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు పూర్తయ్యేలోగా మరో కార్యక్రమాన్ని తెరమీదకు తీసుకొచ్చేలా ఐప్యాక్ కార్యాచరణ రూపొందిస్తోంది.ఆగస్టు నెలాఖరులోగా మండల కమిటీలు పూర్తికాగానే వై ఏపీ నీడ్స్ జగన్, పార్టీ జిల్లా అధ్యక్షుల బస్ యాత్రలు ప్రారంభం కానున్నాయి. ఇవి పూర్తయ్యేలోగా మరో కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఇలా సెప్టెంబరు నుండి నవంబరు వరకూ వివిధ కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్యే ఉండేలా కార్యాచరణ సిద్ధమౌతోంది. సజగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల విజ్ఞప్తుల కారణంగా మరో మారు నిర్వహించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చేంత వరకూ వివిధ కార్యక్రమాలతో నేతలు ప్రజల మధ్యే నిత్యం గడిపేలా సీఎం జగన్ కార్యక్రమాలనులా రూపొందిస్తున్నారు. ఇదినినిలావుండగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యేలు ఎన్నికల సమయం వచ్చే వరకూ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం కూడా పార్టీ సీనియర్ నేతల్లో వ్యవక్తమవుతోంది. చేస్తున్న మంచిని చెప్పే క్రమంలో పదే పదే ప్రజల మధ్య ఉంటే ప్రతిపక్షాల విమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు. పార్టీలోని బూత్ లెవల్ నుండి రాష్ట్ర స్థాయి వరకూ వివిధ కార్యక్రమాల్లో నిత్యం బిజీబిజీగా ఉండేలా అనేక కార్యక్రమాలను రూపొందించాలని అధిష్టానం యోచిస్తోంది.

# కోతులు..బాబోయ్... కోతులు

**ఏలూరు, ఆగస్టు 28:**

దోమలు, మురుగు కాల్వలు రోడ్లు సమస్య ఇలా సామాజిక సమస్యలపై ఊరంతా పోరాడి హక్కులు సాధించుకుంటారు. కాని ఏలూరులోని ఆ గ్రామస్తులు మాత్రం కోతులు బాబోయ్ కోతులని హడలి పోతున్నారు . ఏకంగా జగనన్నకు చెబుతాం కు కాల్ చేసి తమను కాపాడాలని కోరుకున్నారు. ఏలూరు జిల్లాలో కోతుల పేరు వింటేనే ఆ ఊరు భయపడుతుంది. ఎపుడు ఎటువైపు నుంచి వచ్చి తమపై దాడి చేస్తాయో అని బిక్కుబిక్కున వాళ్లు బ్రతుకుతున్నారు ఆ ఊరు గ్రామస్తులు. ఏ వస్తువైనా తమ ఇంటి ముందు ఆరపెడితే వాటిని అర క్షణంలో నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక ఇంటి నుంచి పిల్లలను సైతం పెద్దలు బయటకు రానివ్వడం లేదు. అవసరం ఉంటేనే తప్ప పెద్దలు కూడా బయటికి వచ్చే సాహసం చేయడం లేదు. దీంతో వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామస్తులు ఆలోచించారు. సమస్య తీవ్రత అధికారులకు అర్ధమయ్యే విధంగా గ్రామస్తులంతా ఒకే సమస్యపై ఫిర్యాదు చేయడంతో అధికారులు సైతం ఆ గ్రామానికి హుటాహుటిన పరుగులెత్తారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం జి కొత్తపల్లికి సమీపంలోనే అటవీ ప్రాంతం ఉంది. అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో కోతులు సంచరిస్తుం టాయి. అయితే ఆహార కొరత మరియు ఇతర కారణాల చేత అవి సమీపంలో ఉన్న జి కొత్తపల్లి గ్రామంలోకి వెలుతు న్నాయి. అయితే గ్రామంలోకి వెళ్లిన క్రమంలో వాటి కంటబడిన చిన్న పిల్లలు, పెద్దలపై వారేమన్నా చేస్తారనే భయంతో వారిని గాయపరుస్తున్నాయి. అంతేకాక వాటి కంటపడిన ప్రతి వస్తువులను, ఆరబెట్టిన పదార్థాలను సైతం నాశనం చేస్తు న్నాయి. దీంతో గ్రామస్తులు భయాం దోళన చెందారు. గత కొన్ని రోజులుగా కోతుల దాడులు మరీ ఎక్కువయ్యాయి. సమస్యను అలాగే విడిచి పెడితే మరింత జటిలమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు భావించారు. ఈ క్రమంలోనే వారంతా ఏకమై ప్రభుత్వ సహకారంతో సమస్య పరిష్కారానికి ఆలోచన చేశారు. అందులో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం ఆన్లైన్ ఫోన్ నెంబర్ ద్వారా తమ గ్రామంలో కోతుల సంచారం, దాడులపై అధికారులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల్లో సుమారు 18 మంది ఆన్లైన్ ఫోన్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయడంతో అధికారులు గ్రామానికి పరుగులెత్తారు. ద్వారకా తిరుమల ఎంపీడీవో సుబ్బారాయన్ గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేసి కోతుల వలన జరిగిన దాడులను, వారికి కలిగిన ఇబ్బందులను తెలుసుకున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అధికారులు స్పందించి పరిష్కారం చూపిస్తాననడంతో సంతోషం వ్యక్తం చేశారు.

# అమిత్ షా కు రియాల్టీ రిపోర్ట్....

**హైదరాబాద్, ఆగస్టు 28:**

తెలంగాణలో ఎలాగైనా పాగా వేయాలని ఆలోచిస్తున్న భారతీయ జనతా పార్టీ.. వ్యూహాలకు పదునుపెట్టి దూసుకెళ్తోంది. అసలు గ్రౌండ్ లెవల్లో ప్రజల నాడి ఎలా ఉంది..? ప్లాన్ వర్కవుట్ అవుతుందా..? లేదా..? ఈ క్రమంలో ఎలాంటి లోపాలున్నాయి. నియోజకవర్గాల్లో పల్స్.. రాష్ట్ర కమిటీ పనితీరు ఎలా ఉంది..? ఎలాంటి మార్పులు చేస్తే బాగుంటుంది.. ఎవరు ఎలాంటి వారు.. ఇదంతా గ్రౌండ్ లెవల్ రిపోర్ట్.. కానీ ఇదే కావాల్సింది.. అందుకే రహస్యంగా.. అదంతా బయటకు కనిపించకుండా లోపలే మేనేజ్ చేశారు. వారం రోజులుగా వాళ్లంతా తెలంగాణలోని నియోజకవర్గాల్లో తిరిగారు.. బీజేపీకి పబ్లిక్‌లో రూట్ లెవెల్లో ఎలా ఉందో ఇన్ఫర్మేషన్ సేకరించారు. పార్టీకి ప్లస్సులు.. మైనస్సులు ఏంటో ఇవాళ అమిత్ షాకు రిపోర్ట్ ఇచ్చారు. వాళ్ల ఫీడ్ బ్యాక్ మొత్తం అమిత్ షాకు అందజేశారు. దీని ప్రకారమే.. అధిష్టానం.. మరో ప్లాన్ బీని కూడా సిద్ధం చేయనుదని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల టైమ్? దగ్గర పడుతుండడంతో ఈసారి ఎలాగైనా తెలంగాణలో జెండా ఎగరేయాలని వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాలకు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలను బీజేపీ హైకమాండ్ పంపించింది. ఉత్తరప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, కర్నాటక, పుదుచ్చేరి, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 119 మంది ఎమ్మెల్యేలు వారం కిందటే తెలంగాణలో దిగారు.. వాళ్లంతా వారం రోజుల పాటు ఆయా నియోజకవర్గాల్లోనే ఉన్నారు..
వీళ్ల పనేంటంటే.. పార్టీ లోకల్ లీడర్లు, మండల, బూత్ స్థాయి కార్యకర్తలను కలిసి మాట్లాడతారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలా అమలవుతున్నాయి? పార్టీ బలోపేతం, బూత్ కమిటీల పనితీరు, వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు ఉన్న అవకాశాలు, టికెట్ ఎవరికి ఇస్తే బాగుంటుంది? తదితర విషయాలపై హైకమాండ్?కు నివేదిక అందజేస్తారు. ఆ నివేదికల ఆధారంగానే హైకమాండ్ రాష్ట్రంలో ఎన్నికల వ్యూహాలను రచించనుంది.అయితే.. తెలంగాణలోని ఏ మూలకెళ్లినా.. పబ్లిక్.. బండి సంజయ్ మేటరే గుర్తు చేశారట.. బండిని తప్పించడంపై నెగటివ్ రిపోర్ట్ వచ్చినట్లు సమాచారం. మరో మెయిన్ పాయింట్ ఏంటంటే.. కవిత విషయంలో కేంద్ర పెద్దలు వ్యవహరించిన తీరుపైనా పబ్లిక్ మండిపడుతున్నారట..ఈ రెండు తెలంగాణ బీజేపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా..ఎమ్మెల్యేలతో జనం చెబుతున్నారట.. ఈ విషయాలే అమిత్ షా చెవిలో పడేయాలని.. వాళ్లంతా తహతహలాడుతున్నారని టాక్.. మరి ఈ రిపోర్ట్‌పై ఢిల్లీ పెద్దలు ఎలా స్పందిస్తారో..ఏమో.. గానీ.. బీజేపీ ఎమ్మెల్యే రిపోర్ట్ మాత్రం హాట్ టాపిక్ గా మారింది.

# జనసేన నాయకులు పై వైసీపీ వర్గాలు దాడి

**అముదావలస**

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, బాణం గ్రామంలో ఆ గ్రామ జనసేన నాయకులు ఆధ్వర్యంలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ పేడాడ రామ్మోహన్ రావు చేతుల మీదుగా జనసేన జెండా ఆవిష్కరణ జరిగింది. అనంతరం రామ్మోహన్ గ్రామ సమస్యల పై ఉద్దేశించి మాట్లాడిన మాటలకు వైసీపీ నాయకులు తట్టుకోలేక కోపానికి గురై జనసేన కార్యకర్తల పైన దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని రామ్మోహన్ రావు తీవ్రంగా ఖండించారు. మీరు ఎన్ని బెదిరింపులు చేసిన బాణం గ్రామ సమస్యలు పరిష్కరించే వరకు జనసేన పార్టీ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు యలకల రమణ, నాయకులు పాత్రుని పాపారావు, పైడి మురళీమోహన్, కొంచాడ సూర్య , కొన్న సురేష్, కోరాడ రాజు, సూర సింహాచలం, అగత శివ, పంచిరెడ్డి శ్రీను, వంజరాపు చిన్న ,జనసేన ప్రసాద్, దువ్వాడ కరుణాసాగర్, లొట్టి సూరిబాబు, లొట్ల మనోజ్, జరజపు గణేష్,మరియు భారీ సంఖ్యలో జనసేన కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలపై మంత్రి సమీక్ష

**హైదరాబాద్**
హైదరాబాద్ నగరంలో గణేష్ ఉత్సవాల నిర్వాహణపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, మేయర్, పలు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు సహా పలువురు పాల్గోన్నారు. బాలాపూర్, ఖైరతాబాద్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సికింద్రాబాద్ వైఎంసీయే గణేష్ ఉత్సవ సమితి లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గోన్నారు. నగరంలో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించే అంశంపై చర్చ జరిగింది. ఉత్సవ కమిటీల అభిప్రాయాలతో పాటు సలహాలు మంతరి స్వీకరించారు.

## కూన ఇంటిదగ్గర పోలీసుల మోహరింపు

**కుత్బుల్లాపూర్**
పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద మోహరించారు. ముందస్తు అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

## కృష్ణా నదిలో శవమై తేలిన డిగ్రీ విద్యార్థిని

**కోదూరు**
ఇంటి నుంచి శనివారం రాత్రి బయటకు వెళ్లిన డిగ్రీ విద్యార్థిని పరిశే కృపా కృష్ణా నదిలో శవమై తేలింది. విద్యార్థిని కోసం సోమవారం కోదూరు ఎస్సై వి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో చేపట్టిన గాలింపు చర్యలలో హంసలదీవి పుష్కర ఘాట్ సమీపంలో విద్యార్థిని మృతదేహం కనిపించినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఇసుక సత్యాగ్రహంలో ఉద్రిక్త ం

**అవనిగడ్డ**
టీడీపీ నేతలు చేపట్టిన ఇసుక సత్యాగ్రహంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. నాయకుల ప్రసంగాలకు ఘంటసాల ఎస్ఐ శ్రీనివాసు అడ్డుతగిలారు. అనుమతలు ఉన్నాయని జేపీ సిబ్బంది తో మాట్లాడించే ప్రయత్నం టీడీపీ నేతలు చేసారు. అక్కడి సిబ్బంది టీడీపీ నేతల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు. మే లో జేపీ సంస్థ గడువు పూర్తయితే ఎలా రవాణా చేస్తున్నారని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ ప్రశ్నించారు. ప్రసంతంగా నడుస్తున్న నిరసన కార్యక్రమంలో ఉద్రిక్తతలు తీసుకువచ్చేలా ఎస్ఐ వ్యవహరించారని మాజీ ఎంపీ కొనకళ్ల మండిపడ్డారు. ఇసుక తరలింపుకు అనుమతులు చూపాలని బుద్ధప్రసాద్ డిమాండ్ చేసారు.

## రూరల్ ఎమ్మెల్యే హౌజ్ అరెస్టు

**నెల్లూరు**
నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డినీ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.నగరంలోని మినగల్లు ఇసుక రీచ్ వద్ద ఆందోళనకు బయలుదేరుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసుల మోహరించారు.చలో మినగల్లు కార్యక్రమం నేపథ్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ని అరెస్ట్ చేయడంతో కార్యాలయం వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తల కోలాహలం మొదలైంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాజా నాయుడు మదన కుమార్ రెడ్డి తదితరులు రోడ్డుపై కూర్చుని నినాదాలు చేశారు ఎంత దారుణమైన ప్రభుత్వాన్ని ఇంతవరకు చూడలేదని ఆరోపించారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు భారీగా మోహరించడం జరిగింది.

## జైలునుంచి ఖైదీ పరారీ

**బెంగళూరు**
కర్ణాటకలోని దావణగెరె సబ్ జైలు నుంచి వసంత్ కుమార్ అనే ఖైదీ తప్పించుకున్నాడు. బాగా ఎత్తైన జైలు గోడపై నుంచి అవతలికి దూకి, పరారయ్యాడు. సీసీ టీవీ కెమెరాలో ఈ దృశ్యాలు నిక్షిప్తం అయ్యాయి. అయితే ఎత్తైన గోడ నుంచి దూకడంతో వసంత్ కాలికి గాయాలయ్యాయి. దీంతో అతడు కుంటుకుంటూ వెళ్లాడు. గతంలో అతడిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. బసవనగర్ పోలీస్ స్టేషన్ అధికారులు అతడి కోసం గాలిస్తున్నారు.

## నాయుడుపేటలో భారీ చోరీ

**నాయుడుపేట**
నాయుడుపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్ లో ఆదివారం రాత్రి మూడు ఇళ్లలో భారీ చోరీ జరిగింది. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు తాళాల పగలగొట్టి ఇళ్లలో ప్రవేశించి బీరువాలు ఇతర ప్రాంతాల్లో ఉన్న బంగారు వెండి నగదును దోచుకెళ్లారు.అన్నమేడు హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మధుసూదన్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 2 లక్షల రూపాయల నగదు,15 సవర్ల బంగారం నగలు,చిట్టమూరు మండలం మొలకలపూడి పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ శ్రీనివాసులు ఇంటిలో 35 సవర్ల బంగారు నగలు,3 కేజీల వెండి నగలు దోచుకెళ్ళారు.

# బెజవాడ పార్లమెంట్ పోటీకి కేశినేని దూరం

**విజయవాడ, ఆగస్టు 28:**

బెజవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని పార్టీ మార్పు పై భారీగా ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. పార్లమెంట్ స్థానానికి పోటీ పడుతున్న కేశినేని వచ్చే ఎన్నికల్లో అసలు బరిలో ఉండరన్న ప్రచారం కూడా జరుగుతోంది. కేశినేని కొంత కాలంగా పార్టీకి , పార్టీ అగ్రనాయకత్వానికి దూరంగా ఉంటున్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర బెజవాడకు వచ్చినప్పుడు ఆయన ఆ కార్యక్రమానికి హజరు కాలేదు. దీంతో ఇక ఆయన పార్టీ నుండి దూరం అవటం ఒక్కటే మిగిలి ఉందనే ప్రచారం ఊపందుకుంది. అయితే దీని పై అటు కేశినేని నాని కాని, ఆ పార్టీలోని కీలక నేతలు కాని అసలు నోరు విప్పటం లేదు లోకేష్ తో పాదయాత్రలో పాల్గొనకపోవటం వెనుక కారణలు చెప్పేందుకు కేశినేని నాని అస్సలు ఇంట్రస్ట్ చూపించలేదు. ఆయన మౌనం పై కూడ సొంత పార్టీ కి చెందిన నాయకుల్లో నే రక రకాలుగా రూమర్స్ క్రియేట్ అయిపోతున్నాయి. అయినా వాటిని కేశినేని పట్టించుకోవటం లేదు. కేశినేని నాని తీరు , ఆయన వ్యవహర శైలి పై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీసింది. ఇటీవల కాలంలో నందిగామకు



చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యుడు మొండి తోక జగన్ మోహన్ రావుతో, కలసి అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న కేశినేని ఆయన్ను అభినందించారు. అంతే కాదు మైలవరం శాసన సభ్యుడిగా ఉన్నవసంత తో కూడ కేశినేని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆయన తీరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారని ఊహాగానాలు వినిపించాయి. అయితే ఇటీవల కేశినేని నాని ఇంటిలో ఆయన కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమం లో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొనడంతో అంతా సైలెంట్ అయ్యిపోయారు. అయితే ఇప్పుడు లోకేష్ నిర్వహించిన యువ గళం పాదయాత్రకు సైతం పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న కేశినేని నాని హజరు కాలేదు. అంతే కాదు ఇటీవల చంద్రబాబు నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమం విజయవాడలో జరిగిన సమయంలో కూడ కేశినేని నాని దూరంగా ఉన్నారు. ఇలా వరుసగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులతో కలసి పాల్గొనటం, అధికారులను వెంట పెట్టుకొని నాని ముందుకు వెళ్ళటం వెనుక కారణాలు పై చర్చ జరుగుతోంది.వైసీపీలో ప్రస్తుతం విజయవాడ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి ఎవరూ లేరు. గత ఎన్నికల్లో పోటీ చేసిన పీవీపీ తర్వాత పెద్దగా యాక్టివ్ రాజకీయాల్లో లేరు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఈ సారి పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలుస్తోంది. విజయవాడ పార్లమెంట్ స్థానం వైఎస్ఆర్ కాంగ్రెస్ లో ఖాళీగా ఉంది కాబట్టి, ఆయన వచ్చినా ఆశ్చర్యం లేదని వైసీపీ కీలక నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇదంతామైండ్ గేమ్ అని.. ఆయన పోటీ చేయకుండా అయినా ఉంటారు కానీ వైసీపీ తరపున పోటీ చేయరని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మొత్తంగా కేశినేని నాని మాత్రం హాట్ టాపిక్ అవుతున్నారు.

# వరుస కార్యక్రమాలతో తెలుగు తమ్ముళ్లు

**విజయవాడ, ఆగస్టు 28:**

అధికారంలో ఉంటే అధికార బాధ్యతలతో తీరిక లేకుండా ఉంటారు టీడీపీ చీఫ్ చంద్రబాబు. పార్టీని పట్టించుకోరు. అదే అధికారం లేకపోతే పూర్తి సమయం పార్టీ కోసం కేటాయిస్తారు. ఆయన రాజకీయ వ్యూహాల గురించి ఎవరికీ డౌట్స్ ఉండవు. ఘోర పరాజయం ఎదురైనా.. ఏ మాత్రం ఆత్మవిశ్వాసం తగ్గించుకోలేదు. మొదటగా నడక ప్రారంభించారు. తర్వాత జాగింగ్ చేశారు. ఇప్పుడు పరుగు అందకుంటున్నారు. ఎన్నికలకు ఆరేడు నెలల ముందే ఏపీలో ఎటు వైపు చూసినా తెలుగుదేశం పార్టీ జెండాలు కనిపించేలా ప్లాన్ చేసుకున్నారు. మినీ మేనిపెస్టోను ప్రకటించి.. పార్టీ నేతలందర్నీ ఇంటింటికి పంపుతున్నారు. అయితే ఇది ఆరంభమేనని.. ముందు ముందు అసలు ప్రచార భేరీ ఉందని చెబుతున్నారు. వచ్చే ఎనిమిది నెలల పాటు టీడీపీ క్యాడర్ అంతా.. ఓటర్లను అంటిపెట్టుకుని ఉండేలా కార్యక్రమాలను ఖరారు చేస్తున్నారు. ఇందు కోసం గృహసారధులనే వ్యవస్థనూ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏ తెలుగుదేశం పార్టీ.. ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్లేందుకు సరికొత్త కార్యక్రమాలు రూపొందిస్తోంది. సెప్టెంబర్ 1 నుంచి బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీడీపీ కొత్త కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లనుంది. 45 రోజులపాటు ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగనుంది. ప్రతి ఒక్క ఇన్‌ఛార్జ్ ప్రతి ఇంటిని టచ్ చేసేలా కొత్త కార్యక్రమం రూపకల్పన జరిగింది. సెప్టెంబర్ 1 నుంచి వారానికి ఐదు రోజులపాటు ఇందులో పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొననున్నారు. ఇప్పటికే బాదుడే బాదుడు– ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలు పూర్తి చేసిన టీడీపీ. మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గతంలో వన్ మ్యాన్ ఆర్మీ అన్నట్లుగా వ్యవహరించేవారు. అంతా ఆయన భుజాలపై మోసేవారు. ఇతరులకు మోసే సామర్థ్యం ఉన్నా బాధ్యతలు పంచేవారు కాదు. కానీ ఇప్పుడు ఆయన పనితీరులో హఠాత్తుగా మార్పు వచ్చింది. మొత్తం వ్యవహారాలను వికేంద్రీకిరంచారు. తాను చేయాల్సినవి మాత్రమే తాను చేస్తున్నారు. అందరికీ పని చెప్పారు. చంద్రబాబు జిల్లాల పర్యటనలు, లోకేష్ పాదయాత్ర, మహిళా శక్తి , ఇసుక సత్యాగ్రహం వంటి కార్యక్రమాలతో ఇలా రాష్ట్రంలో ఏ మూల చూసినా టీడీపీ కార్యక్రమాలే జరుగుతున్నాయా అన్నంతగా తెలుగుదేశం పార్టీ ప్రజల్లోకి వెళ్తోంది. ఒక దాని తర్వాత ఒకటి కాకుండా.. ఒకటి కొనసాగుతూండాగనే మరో ప్రచార కార్యక్రమం ప్లాన్ చేసుకున్నారు. ఎక్కడా గందరగోళం లేకుండా నేతలంతా ఏదో ఓ కార్యక్రమంలో బిజీ అయ్యేలా ప్రచార కార్యక్రమంలో పాల్గొంటూడటంతో.. టీడీపీ మాత్రమే సీరియస్‌గా రాజకీయాలు చేస్తోందా అన్న అభిప్రాయం కల్పించేలా చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమి.. ఆ తర్వాత ప్రభుత్వ వేధింపుల కారణంగా క్యాడర్,లీడర్ చాలా వరకూ సైలెంట్ గా ఉండిపోయారు. వారందర్నీ పూర్తి స్థాయిలో యాక్టివ్ అయ్యేలా చంద్రబాబు చేశారు. వరుసగా ఇన్ని కార్యక్రమాలు చేపడుతూంటే ఏ పార్టీ క్యాడర్ అయినా కాస్త అలసిపోతారు. కానీ టీడీపీలో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఊహించని పార్టీ అగ్రనేతలు కష్టపడుతూండటం.. కార్యకరక్తలందరికీ భరోసా ఇస్తూండటంతో అందరూ ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తమ సహజసిద్ధ నెమ్మదైన స్వభావాన్ని వదిలించుకున్నారు. జనాల్లోకి వెళ్తూంటే.. వైసీపీ నేతుల దాడులు చేస్తున్నారు..భయపడితే అదే సమస్య అవుతుందని కేసులైనా సరే తిరగబడి కొట్టడం ప్రారంభించారు. ఇప్పటి వరకూ ఆత్మరక్షణ ధోరణిలో ఉండేవారు.. ఇప్పుడు ఎదురు దాడి చేస్తున్నారు. ఇవన్నీ టీడీపీ క్యాడర్ పూర్తి స్థాయిలో యాక్టివ్ అవడానికి కారణం అయ్యాయని అనుకోవచ్చు

# ఆసుపత్రులకు మంచి రోజులు

**విశాఖపట్టణం, ఆగస్టు 28:**




విశాఖపట్నంలోని ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి, మానసిక ఆరోగ్య ఆస్పత్రులకు అరుదైన గౌరవం లభించింది. రోగులకు అందిస్తున్న అత్యుత్తమ వైద్య సేవలకు గానూ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్, హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు దక్కింది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా విశాఖలోని రెండు ఆసుపత్రులకు నేషనల్ అక్రిడియేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్(ఔంఃఉ) అక్రిడిటేషన్ లభించింది. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఔంఃఉ ఓ విభాగం. దేశంలోని ఆసుపత్రులు, హెల్త్ కేర్ సెంటర్స్, రక్తదాన కేంద్రాలు, ఆయుష్ ఆసుపత్రులు, వివిధ స్థాయిల్లో పనిచేసే హెల్త్ కేర్ యూనిట్లకు నాణ్యతా ప్రమాణాలను బట్టి గుర్తింపు ఇస్తుంది. సుమారు 10 చాప్టర్లు, 100 ప్రమాణాలు కలిగిన ఈ విభాగం 503 లక్ష్యాలతో పనిచేస్తుంది. ఆసుపత్రులు ఈ అక్రిడేషన్ కోసం బోర్డుకు దరఖాస్తు చేసుకుంటాయి. కేంద్రం ఇచ్చిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి, ఆసుపత్రులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ూూఖ)కి అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాత, వాటికి అక్రిడిటేషన్ మంజూరు చేయడం జరుగుతుంది. అక్రిడిటేషన్ కాలపరిమితి మూడేళ్లు ఉంటుంది. ఔంఃఉ ధ్రువీకరణ పొందాలంటే ఆసుపత్రులు ముఖ్యంగా ఎనిమిది విభాగాల్లో నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలి. ఈ ప్రమాణాలన్నింటిని విశాఖపట్నంలోని రెండు ఆస్పత్రులు అందుకున్నాయి. సర్వీస్ ప్రొవిజన్, రోగుల హక్కులు, ఇన్‌పుట్స్, సహాయక సేవలు, క్లినికల్ కేర్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, నాణ్యమైన ఆరోగ్య సేవల నిర్వహణ, రోగి భద్రత ఈ విభాగాల్లో సంపూర్ణమైన ప్రమాణాలు పాటిస్తున్నాయి. వీటిని పరిశీలించిన బోర్డు రెండు ఆస్పత్రులకు అక్రిడిటేషన్ మంజూరు చేసింది. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ స్థాయి ప్రమాణాలు రాష్ట్రంలోని అన్ని టీచింగ్ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, ఖఉఅ, జఖఉఅ, అఉూ, ఎఉఅలలో సైతం జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు (ఔఖియా) ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజలకు ఆరోగ్య సేవలను అత్యుత్తమ ప్రమాణాలతో అందించాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ పలుమార్లు నిర్దేశించారు. ఇందుకోసం నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ అష్యూరెన్స్ ప్రోగ్రామ్‌ను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని హెల్త్ కేర్ సెంటర్లు, ఆసుపత్రుల్లో ప్రమాణాలు ఉండేలా తీర్చిదిద్దుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 537 ఆరోగ్య కేంద్రాలు, బోధనాసుపత్రులు ఔఖియా ప్రమాణాలను అందుకున్నాయి. 2023–24 సంవత్సరానికి 2,956 కేంద్రాలను ఈ పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.ప్రసవ సమయంలో సంరక్షణ నాణ్యతను మెరుగుపరచడం, ప్రసవానంతర సంరక్షణ, ప్రసవ సమయంలో సమస్యల తీవ్రతను తగ్గించడం, ప్రజారోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు గౌరవ ప్రదమైన ప్రసూతి సంరక్షణ అందించడం ఇందులో మరొక ప్రధానమైన అంశం. ప్రసూతి మరణాల రేటును పూర్తిస్థాయిలో తగ్గించడమే లక్ష్యంగా ఔఖియా పనిచేస్తుంది. 2022–23 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ధ్రువీకరించబడిన జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు (ఔఖియా) సాధించిన ఆరోగ్యం కేంద్రాలు 2041 అయితే, ఇందులో 452 ఆరోగ్యకేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఈ విషయంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా ఔఖియా ప్రమాణాలు సాధించిన ఆరోగ్యకేంద్రాల్లో 18% ఏపీలోనే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడచిన మూడున్నర నెలల్లోనే 170 ఆరోగ్యంకేంద్రాలను ఔఖియా ధ్రువీకరణ కోసం పంపించారు.

# మైనంపల్లి... యూ టర్న్..

**హైదరాబాద్, ఆగస్టు 28:**

వారం రోజుల పాటు మల్కాజిగిరి నియోజకవర్గంలో పర్యటించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని బీఆర్ఎస్ నేత మైనంపల్లి హన్మంతరావు ప్రకటించారు. మేడ్చల్ జిల్లా దూలపల్లిలోని ఆయన నివాసానికి ఇవాళ పెద్దఎత్తున భారాస కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఆయన భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తన కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ టికెట్‌ను నిరాకరించడంతో అనుసరించాల్సిన వ్యూహాలపై అనుచరులతో మైనంపల్లి చర్చించారుఅనుచరులతో సమావేశం తర్వాత మైనంపల్లి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. జీవితంలో స్థిరపడటం అంటూ ఉండదు. చనిపోయిన తర్వాతే జీవితంలో స్థిరపడినట్లు. టిడిపి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా 8 ఏళ్లు పనిచేశా. ఆ తర్వాత భారాసలో ఉన్నా. ఏ పార్టీలో ఉన్నా.. వెన్నుపోటు పొడిచే అలవాటు నాకు లేదు. ప్రాణం పోయే వరకు మాటపైనే ఉంటా. మెదక్ ప్రజలు నాకు రాజకీయ ప్రాణభిక్ష పెట్టారు. నేనూ ఎప్పుడూ కాంగ్రెస్, భారాస, భాజపాను తిట్టలేదని స్పష్టం చేశారు. అంతా కలిస్తేనే తెలంగాణ సాకారమైంది. భారాసను ఏమీ అనలేదు.. పార్టీ కూడా నన్ను ఏమీ అనలేదు. మల్కాజిగిరిలో వారం రోజులపాటు అనుచరులందరినీ కలుస్తాను. కార్యకర్తలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని తెలిపారుతిరుమలలో తాను చేసిన వ్యాఖ్యల తర్వాత బీఆర్ఎస్ పెద్ద నేత తనతో మాట్లాడారని మైనంపల్లి ప్రకటించారు. మీడియాకు ఎక్కవద్దని సూచించారని వెల్లడించారు. ఆ పెద్ద నేత ఎవరు అన్నది ఆయన చెప్పలేదు కానీ.. కేసీఆర్ అయి ఉంటారని భావిస్తున్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తర్వాత ఆయనపై చర్యలు తీసుకునేందుకు బీఆర్ఎస్ హైకమాండ్ సిద్ధమయింది. మైనంపల్లికి కాకపోతే ఎవరికి టిక్కెట్ ఇవ్వాలన్నదానిపైనా కసరత్తు చేశారు. అయితే హఠాత్తుగా ఆయన కూడా సైలెంట్ అయ్యారు. బీఆర్ఎస్ హైకమాండ్ కూడా చర్యల విషయంలో సైలెంట్ అయిపోయింది. ఈ కారణంగానే ఆయనపై చర్యలు తీసుకోవడం లేదన్న ప్రచారం జరుగుతోంది. కుమారుడే తనకు ముఖ్యమని.. గతంలో వ్యాఖ్యానించిన మైనంపల్లి తాజాగా కొద్దిగా స్వరం తగ్గించారు. అయితే నా కొడుకుకు 25 ఏళ్లు.. ఇంకా భవిష్యత్ ఉంది. భారత్‌లో పోటీతత్వం ఉంది.. నా కొడుకు నా కంటే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మెదక్‌లో నా కుమారుడు తిరిగి ప్రజాభిప్రాయం కోరతాడు అని ప్రకటించారు. అంటే కుమారుడి టిక్కెట్ పై వెనక్కి తగ్గినట్లేనని భావిస్తున్నారు. తాను మల్కాజిగిరిలో.. తన కుమారుడు మెదక్ లో పర్యటించిన తర్వాత వారం తర్వాత మీడియాను పిలిచి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని మైనంపల్లి వెల్లడించారు.

# వామపక్షాలకు స్నేహహస్తం...

**హైదరాబాద్, ఆగస్టు 28:**

బిఆరెస్‌తో పొత్తు అని చెప్పి అభ్యర్థులను ప్రకటించిన కెసిఆర్ మిత్ర ద్రోహం చేసారంటు ఆగ్రహంగా ఉన్న వామపక్ష పార్టీలకు.. కాంగ్రెస్ పార్టీ స్నేహహస్తం అందిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఓటు చీలకుండా ఉండాలంటే అందరం కలిసి పని చేద్దామంటూ ఏఐసిసి ఇంచార్జ్ థాక్రే ఇరు పార్టీల కార్యదర్శులకు ఫోన్ చేశారు. దీంతో ఇరు పార్టీల నేతలతో కాంగ్రెస్ చర్చలు ప్రారంభించింది. ఆదివారం నాడు సిపిఐ నేతలతో థాక్రే రహస్య మంతనాలు చేశారు. థాక్రే తో జరిగిన సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, అజీజ్ పాషా లు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో కలిసి పోరాడుదామని ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలకుండా కలిసి పని చేద్దామని థాక్రే సిపిఐ నేతలతో చర్చించారు.థాక్రే ముందు 4 సీట్లు సిపిఐ ప్రతిపాదనలు పెట్టింది. మునుగోడు, బెల్లంపల్లి, కొత్తగూడెం, హుస్నాబాద్ స్థానాలు అడుగుతుంది. మునుగోడు, హుస్నాబాద్ ఇవ్వడానికి కాంగ్రెస్ సుముఖంగా ఉంది. వీటితో పాటు ఒక ఎమ్మెల్సీ స్థానం కూడా ఇవ్వడానికి కాంగ్రెస్ సిపిఐ నేతలతో తెలిపింది. కొత్తగూడెంకి కాంగ్రెస్ నుండి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పోటీ చేయాలని భావిస్తున్నారు. బిఆరెస్ తో పొత్తులో కూడా కొత్తగూడెం వస్తుందని భావించి చాలా నెలలుగా అక్కడ కూనంనేని పని చేస్తున్నారు. ఇక ఇతర స్థానాల్లో కూడా కాంగ్రెస్, సిపిఐ లు బలంగా ఉన్నాయి.సిపిఎం కూడా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సిపిఎం పాలేరు, మిర్యాలగూడతో పాటు మరో రెండు స్థానాలు అడుగుతుంది. నిర్దిష్ట ప్రతిపాదన వచ్చినప్పుడు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామని పార్టీ నేతల సమావేశంలో తమ్మినేని వీరభద్రం తెలిపారు. రేపు సిపిఎంతో కాంగ్రెస్ నేతలు చర్చలు జరిపే అవకాశం ఉంది.బిఆరెస్ పొత్తు చెడిన తరువాత వామపక్షలకు కాంగ్రెస్ స్నేహహస్తాన్ని ఉపయోగించుకొని చట్టసభల్లో అడుగు ఎడుతుందా లేక సీట్ల తో పంతానికి పోయి పోటీకే మాత్రమే పరిమితం అవుతుందా చూడాలి మరి

# సెప్టెంబర్ నుంచి స్కూళ్లలో ఫేసియల్ రికగ్నైజేషన్

**కరీంనగర్, ఆగస్టు 28:**

ప్రభుత్వ పాఠశాలల్లో 'ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ' విధానం అమల్లోకి రానుంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో?. సెప్టెంబర్ నెల నుంచి ఈ విధానాన్ని అమలు చేసే దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది.ఇక సర్కార్ పాఠశాలల్లో 'ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్' విధానం అమల్లోకి రానుంది. ఈ విధానంపై ఇప్పటికే సర్కార్ కసరత్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. కీలమైన సాఫ్ట్ వేర్ టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో... పాఠశాలల్లో ఈ విధానం అమలుపై సర్కార్ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలోని అన్ని సర్కార్ పాఠశాలల్లో సెప్టెంబర్ మాసం నుంచి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ను ప్రారంభించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ విధానం అమల్లోకి వస్తే విద్యార్థులు, టీచర్లతో పాటు ఇతర సిబ్బంది కూడా దీని ద్వారనే హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గుజరాత్, ఢిల్లీ, నాగాలాండ్, ఆంధ్రప్రదేశ్ తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం ఇప్పటికే అమలవుతున్నది. ఇదే క్రమంలో తెలంగాణ సర్కార్ కూడా ఆ దిశగా ఆలోచన చేసింది. పలు పాఠశాలలను ఎంచుకొని పైలెట్ ప్రాజెక్ట్ ను కూడా అమలు చేసింది. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నందున రాష్ట్రమంతటా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ తర్వాత టెండర్లను కూడా పిలిచింది. మరోవైపు ఇప్పటికే టీచర్లకు ట్యాబ్‌ల పంపిణీ పూర్తయింది.ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌ను ట్యాబ్‌లలో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే... ముఖ ఆధారిత హాజరు విధానం అమలుచేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇది పూర్తిగా ఏఐ ఆధారంగా పనిచేస్తుంది.స్మార్ట్‌ఫోన్/ ట్యాబ్‌లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి? కెమెరా ఆధారంగా స్కాన్ చేయగానే ముఖాలను గుర్తించి దానికదే హాజరు నమోదు చేస్తుంది. వెయ్యిలోపు విద్యార్థులున్న బడికి ఒకటి, వెయ్యి మంది కంటే అధికంగా ఉన్న స్కూళ్లకు రెండు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ ట్యాబ్‌లలో ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను నిక్షిప్తం చేసి, వీటి ఆధారంగా హాజరును నమోదుచేస్తారు. ప్రధానంగా ట్యాబ్ లలో విద్యార్థులు, టీచర్ల యాప్‌లో లోడ్‌చేస్తారు. ఫలితంగా క్లాస్ టీచర్ స్మార్ట్‌ఫోన్/ ట్యాబ్ కెమెరాను తెరిచి మొత్తాన్ని స్కాన్ చేయగానే ఎఫ్ఆర్ఎస్ అప్లికేషన్, కాగ్నిటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి, డాటాబేస్‌లో ఉన్న చిత్రాలో పోల్చుకుంటుంది. ఆయా ముఖాల ఆధారంగా క్లాసుకు ఎంత మంది హాజర య్యారనే దానిపై లెక్క తేలుస్తుంది. తక్కువ హాజరుశాతం ఉంటే అలర్ట్ కూడా జారీ చేసే విధానం ఇందులో ఉంటుంది.ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతేడాది నుంచి ఈ విధానం అమలు చేస్తున్నప్పటికీ అనేక ఇబ్బందులు తలెత్తాయి.కీలకమైన అన్ని శాఖల్లో ఈ తరహా విధానం అమల్లోకి రావటంతో... సర్వర్ ఇబ్బందులు వచ్చాయి. సాంకేతికపరంగా తలెత్తిన సమస్యలను అధిగమిస్తూ వచ్చింది ఏపీ సర్కార్.

# గన్నవరంలో వల్లభనేని ఎంట్రీ...

**విజయవాడ, ఆగస్టు 28:**

గన్నవరం నియోజకవర్గం నుంచి వైసీపీనేత యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలో చేరడంతో అందరి దృష్టి మరో అసమ్మతి నేత అయిన దుట్టా రామచంద్రరావుపై పడింది. ఆయన వల్లభనేని వంశీ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వంశీ పోటీ చేస్తే సహకరించే ప్రశ్నే లేదంటున్నారు. దీంతో ఆయన పార్టీ వీడకుండా హైకమాండ్ జాగ్రత్తలు తీసుకంటోంది. పరిస్థితుల్ని చక్కదిద్దే బాధ్యతను మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి ఇప్పగించారు. ఆయన వల్లభనేని వంశీతో కలిసి దుట్టా రామచంద్రరావుతో భేటీ కానున్నారు. ఇరువురి మధ్య విబేధాలను పరిష్కరించి.. పార్టీకి ఇబ్బంది లేకుండా చేయాలని ఎంపీ చూస్తున్నారు. వైసీపీ ఏర్పాటు తర్వాత గన్నవరంలో ఆ పార్టీ కోసం పని చేసింది దుట్టా రామచంద్రరావు. యార్లగడ్డ 2019 ఎన్నికల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకుని ఎన్నికల్లో పోటీ చేశారు. . అంతకుముందు వరకూ గన్నవరం నియోజకవర్గానికి అన్నీ తానై చూసుకున్నారు. 2014లో పోటీ చేసి వల్లభనేని వంశీ చేతిలో పరాజయం పాలయ్యారు. గత ఎన్నికల్లో యార్లగడ్డ గెలుపు కోసం ప్రయత్నించారు. అయితే విజయం లభించలేదు . గెలిచిన వంశీ వైసీపీలో చేరిపోయారు. టీడీపీలో ఉన్నప్పుడు తమను కేసులతో ఇబ్బంది పెట్టారని క్యాడర్ ను రాచిరంపాలన పెట్టారని అందుకే వంశీ రాకను యార్లగడ్డ, దుట్టా ఇద్దరూ వ్యతిరేకించారు. హైకమాండ్ అప్పట్లో నచ్చజెప్పి వెల్కమ్ చెప్పింది వైసీపీ. దీంతో వంశీ ఒక్కరే ఒకవైపు ఉండగా.. మరోవైపు దుట్టా, యార్లగడ్డ ఒక్కటయ్యారు. వంశీ రాకతో మొదలైన వివాదం



యార్లగడ్డ రాజీనామా చేసేవరకూ వెళ్లింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ దుట్టాకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. ఎమ్మెల్సీ ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ ఇంతవరకూ ఆ ఊసేలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. యార్లగడ్డ టీడీపీలో చేరకుండా ఉండేందుకు.. వంశీకి ఈసారి వైసీపీ టికెట్ ఇచ్చి.. ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు కానీ.. యార్లగడ్డ అసెంబ్లీ టిక్కెట్ కావాలన్నారు. యార్లగడ్డకు హామీ ఇచ్చారు కానీ.. మొదట్నుంచీ పార్టీకోసం పనిచేసిన దుట్టాకు మాత్రం ఇంతవరకూ ఎలాంటి పదవి ఇవ్వకపోవడం.. కనీసం ఆయనకు అపాయిట్మెంట్ ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి. న్నవరంలో వైసీపీ నుంచి వల్లభనేని వంశీ పోటీ చేయటం ఖాయమైంది. దీంతో ఎన్నికల్లో వంశీకి సహకారం అందించాలని, దుట్టాకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గన్నవరంలో పార్టీ పరిస్థితులపై మూడు నెలల క్రితం సీఎం జగన్‌కు చెప్పిందే.. ఎంపీ బాలశౌరికి చెప్పానన్నారు వైసీపీ నేత దుట్టా రామచంద్రారావు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. మూడు నెలల క్రితం సీఎం జగన్ కలిసి, దుట్టా రామచంద్రరావు ఏం చెప్పారు? పార్టీలోనే కొనసాగుతూ వంశీకి సహకరిస్తానని చెప్పారా? లేక తానే వైసీపీ నుంచి బరిలోకి దిగుతానన్నారా? ఇంతకీ.. సీఎం జగన్‌కు ఆయన ఏం చెప్పి ఉంటారనే ఆసక్తి నెలకొంది. అయితే మొదటి నుంచి గన్నవరంలో వల్లభనేని వంశీ, దుట్టా రామచంద్రరావుకు మధ్య పచ్చగడ్డి వేయకముందే భగ్గుమనే పరిస్థితి ఉంది. అవకాశం చిక్కినప్పుడల్లా ఇద్దరు నేతలు బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. గన్నవరంలో వైసీపీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఈ పరిస్థితిలో ఎంపీ బాలశౌరి రాయబారం ఫలిస్తుందా? దుట్టా చల్లబడినట్లేనా? అటు వంశీ కూడా నియోజకవర్గంలో పరిస్థితులను పూర్తిగా అనుకూలంగా మలచుకొనేందుకు ఒక నివేదికతో త్వరలో సీఎంను కలవనున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి ఎన్నికల ప్రచారం ప్రారంభానికి సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో, గన్నవరం రాజకీయం ఉత్కంఠగా మారుతోంది. దుట్టా రామచంద్రరావు అల్లుడు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు. హైదరాబాద్ లో వైద్యుడు అయిన శివభరత్ రెడ్డి.. పూర్తిగా రాజకీయాల కోసం సమయాన్ని వెచ్చిస్తున్నారు. సీఎం జగన్ సతీమణి భారతి రెడ్డి తరపు బంధువులు కూడా అని ప్రచారం జరుగుతూండటంతో టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారఅయితే పార్టీలో చేరేటప్పుడు ఇచ్చిన హ మీ మేరకు వంశీకే టిక్కెట్ ఇవ్వలని జగన్ అనుకుంటున్నారు. కానీ నేతలు అందరూ దూరం అయితే మొత్తానికే మోసం వస్తుందని.. ఉన్న వారిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దుట్టాను వైసీపీలోనే ఉంచేందుకు ఎంపీ బాలశౌరితో చర్చలు జరుపుతున్నారు.

# డ్రైనేజీ, కాంక్రీట్ రోడ్లకు ఎమ్మెల్యే రామిరెడ్డి శంకుస్థాపన

**కావలి**

కావలి మూడు ,నాలుగు వార్డులలోని ఇంచార్జు మండలి కృష్ణారావు , అనురాధ వార్డులలో 60 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన డ్రైనేజ్ , కాంక్రీట్ రొడ్డులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తరువాత మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2014 లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 600 హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. 2019 ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల గుండెల్లో నిలిచి పోయారని సంక్షేమ పథకాలే మరలా జగన్మోహన్ రెడ్డికి ప్రజలు పట్టం కడతారని 2019 లో 151 సీట్లు ఇచ్చారని 2024 వై నాట్ 175 మావేనని జోస్యం చెప్పారు. అయన వెంట కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి , సీనియర్ నాయకులు జనిగర్ల మహీంద్ర యాదవ్ , ప్రభాకర్. రాజా ,గంధం ప్రసన్నం జనేయులు , దామిశెట్టి సుధీర్ , కామరాజు , నాయబ్ రసూల్ , కందుర్తి కామయ్య , వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాజన్న భోజనశాలను ప్రారంభించిన బాలినేని

**ఒంగోలు**

ప్రకాశం జిల్లా కొమరోలు లో వైఎస్ఆర్సిపి నేత కామూరి రమణారెడ్డి ఏర్పాటు చేసిన రాజన్న భోజనశాలను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు... ఈ భోజనశాలను ప్రారంభించేందుకు వస్తున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి,ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి,జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు జంకే వెంకటరెడ్డి లకు బెస్త వారి పేట నుంచి కోమరోలు వరకు హెలికాప్టర్ లో పూల వర్షం కురిపించారు... కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.. . నాయకుల,కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ కొమరోలు కు తరలివచ్చారు. 5 రూపాయలకే భోజనం అందిస్తున్న రాజన్న భోజనశాలను ప్రారంభించడంతో పాటు వైఎస్ఆర్సిపి నేత కామూరి రమణారెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో బాలినేని,మాగుంట పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిద్దలూరు వైసిపి టికెట్ ఆశిస్తున్న కామురి రమణారెడ్డి తన బల ప్రదర్శన నిరూపించుకునేందుకు ప్రయత్నం చేశారు..

# బ్రెయిన్ స్ట్రోక్ తో యువకుడి మృతి

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కీర్తి అంజి(25) అనే యువకుడు బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్టేషన్ ఏరియాకి చెందిన కీర్తి అంజి అనే యువకుడు ఏలాంటి పని చేయకుండా, నిత్యం మద్యం సేవిస్తూ ఉండేవాడు. అతనికి అనేకసార్లు అతడి అన్నయ్య కీర్తి లక్ష్మణ్, బాబాయ్ లక్ష్మి నరసయ్యులు ఇలాంటి చెడు అలవాట్లు మానుకొని ఏదైనా పని చేసుకోవాలని సూచించినప్పటికీ అంజి తీరు మారలేదు. నిత్యం తాగి వచ్చి గొడవ చేస్తుండటతో విసుగు చెందిన వారిరువురూ సోమవారం అంజి పై బెల్లంపల్లి టూ టౌన్ లో ఫిర్యాదు చేశారు.



దీంతో పోలీసులు అంజిని పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీస్ స్టేషన్లో కూర్చున్న అంజికి అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో గమనించిన సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంజి మృతదేహాన్ని డీసీపీ సుదీర్ రాంనాథ్,ఏసీపీ సదయ్య పరిశీలించారు.

# ఏపీలో ఇసుక యుద్ధం-టీడీపీ వర్సెస్ వైసీపీ

**తిరుపతి, ఆగస్టు 28:**

టిడిపి అధినేత చంద్రబాబు 'ఇసుకాసురుడు 40 వేల కోట్ల దోపిడీ' పేరుతో చేసిన ప్రజెంటేషన్ అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. వైసీపీ 4 ఏళ్ల పాలనలో ఇసుక అక్రమ తవ్వకాలపై చంద్రబాబు చేసిన సంచలన ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వాలు, కోర్టులు, ఎన్జీటీ విధించిన ప్రతి నిబంధనను తుంగలో తొక్కిన వైసీపీ సర్కార్ లో 40 వేలకోట్ల టన్నుల ఇసుక దోపిడీ జరిగిందని ఆరోపించారు. సీఎం జగన్కు ఇసుకే ఆహారం భూములు ఫలహారమని జగన్ ఇసుకాసురుడని తీవ్ర కామెంట్స్ చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టమని తిన్న ప్రతి పైసా కక్కిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా రూ. 40 వేల కోట్ల సొమ్ము దోపిడికి గురైందని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు చిల్లర విదిరించి సొంత జేబులు నింపుకున్నారని సంచలన కామెంట్స్ చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో టిడిపి హయాంలో అమల్లోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానం నుంచి వైసీపీ సర్కార్ లోని ఇసుక పాలసీ వరకు స్లైడ్లు వేసి మరి విశ్లేషించిన చంద్రబాబు సీఎం జగన్ దోపిడీ ఇదంటూ చెప్పే ప్రయత్నం చేశారు చంద్రబాబు. దీనిపై ఘాటుగా స్పందించారు వైసీపీ నేతలు. చంద్రబాబు అల్టిమేటంకు అధికారులే సమాధానం చెబుతారని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉచిత ఇసుక పేరుతో డబ్బులు వసూలు చేశారా, లేదా అని మంత్రి పెద్దిరెడ్డి ప్రతిపక్ష నేతను ప్రశ్నించారు. వసూల్ చేసిన ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్ళిందో చెప్పాలన్నారు. ఈ క్రమంలోనే కేబినెట్ సబ్ కమిటీ ద్వారా ఇసుక పాలసీ తీసుకొచ్చామని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎం.ఎస్. టి.సి ద్వారా టెండర్లను పిలిచామన్నారు పెద్దిరెడ్డి. ఎవరి ప్రభుత్వంలో ఏం జరిగిందో, ఇసుక ఆదాయం ఎంత వచ్చిందో లెక్కలతో సహా బయటపెట్టారని అన్నారు. కావాలంటే చంద్రబాబు ఇసుక టెండర్లలో పాల్గొనాలని కూడా సూచించిన మంత్రి పెద్దిరెడ్డి టన్ను ఇసుక రూ. 375, అదనంగా రూ. 100 అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెన్సెస్‌తో కలిసి రూ. 475 కు టన్ను ఇసుక అందుబాటులోకి తెచ్చామన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఉచిత ఇసుక విధానం పేరు చెప్పి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేశారో లేదో చెప్పాలన్నారు పెద్దిరెడ్డి. చంద్రబాబు హయాంలో ఇసుక తవ్వకాలపై రూ. 100 కోట్లు ఎన్.జీ.టి ఫైన్ వేసిందన్నారు. చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ కు ఇసుక తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. టిడిపి పాలనలో ఉచిత ఇసుక పేరుతో వేల కోట్లు పక్కదారి పట్టాయన్న పెద్దిరెడ్డి 2018-19 లో చంద్రబాబు పాలనలో భూగర్భ గనుల శాఖ కు రూ. 1950 కోట్లు మాత్రమే ప్రభుత్వ ఆదాయం వస్తే 2022-23 లో రూ. 4756 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 2018-19 ఏడాదికి గాను ఎ.పి ఎం.డి.సి సంస్థ కు రూ. 833 కోట్లు ఆదాయం వస్తే, జగన్ పాలనలో రూ. 1806 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు పెద్దిరెడ్డి. ఇక 2022-23 లో రూ. 4 వేల కోట్లు ఆదాయం వచ్చిందని, చంద్రబాబు ఇచ్చే అల్టిమేటంకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు మంత్రి పెద్దిరెడ్డి. తప్పుడు లెక్కలతో చంద్రబాబు చేసిన ప్రజెంటేషన్‌కు త్వరలోనే అదే తరహా ప్రజెంటేషన్ గనుల శాఖ అధికారులు ఇస్తారన్నారు మంత్రి పెద్దిరెడ్డి.

# నగరిలో జగన్ చెప్పినా...

**తిరుపతి, ఆగస్టు 28**

సీఎం జగన్ మోహన్ రెడ్డి నగరి పర్యటనలో భాగంగా వైసీపీలో విభేదాలు వెలుగులోకి వచ్చాయి. నగరిలో ఎప్పటి నుంచో మంత్రి రోజాకు ఇతర నేతలకు అసలు పడటం లేదు. నగరిలో పర్యటించిన సీఎం జగన్ వారి మధ్య విభేదాలు సరి చేసేందుకు ట్రై చేశారు. నగరిలో బహిరంగ సభ ప్రారంభానికి ముందు కేజే శాంతి, మంత్రి రోజా మధ్య సఖ్యత పెంచేందుకు జగన్ ట్రై చేశారు. వారితో ఏదో మాట్లాడుతూ ఇద్దరి చేతులు కలిపేందుకు కూడా ప్రయత్నించారు. మొదట కేజే శాంతి తన చేయి ఇచ్చేందుకు నిరాకరించారు. అయినా సీఎం జగన్ ఆమె చేయిని పట్టుకొని రోజాతో చేయి కలపాలని చూశారు. కానీ ఏదో అలా చేతులు కలిపి వెంటనే వెనక్కి తీసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎప్పటి నుంచో వర్గ విభేదాలు వెలుగు చూశాయి. గత కొన్ని నెలలుగా మంత్రి పెద్దిరెడ్డి, రోజా మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. సీఎం పర్యటన సందర్భంగా కూడా ఈ కుమ్ములాటలు బహిర్గత మయ్యాయి. సీఎం పర్యటన సందర్భంగా వైసీపీ నేతలు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఆ ఫ్లెక్సీల్లో ఎక్కడా రోజా ఫొటో లేదు. ఇవన్నీ గమనించిన సీఎం జగన్... వాటిని సరిదిద్దేందుకు యత్నించారు. కానీ అవేవీ వర్కౌట్ అయినట్టు కనిపించడం లేదు.

# ఇల్లందు కోసం 35 మంది దరఖాస్తులు

**ఖమ్మం, ఆగస్టు 28:**

కాంగ్రెస్ పార్టీ టికెట్ల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే పరిశీలన ప్రక్రియ మొదలైంది. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురికి పైగానే ఆశావాహులు ఉన్నారు. ఇక ఇల్లందు సీటు కోస ఏకంగా 30 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల జాబితాపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. ఇక అధికార బీఆర్ఎస్ ఏకంగా 115 మంది అభ్యర్థులను ప్రకటించి... ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు గట్టి సవాల్ విసిరింది. రేపోమాపో మిగతా 4 సీట్లను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ఈ ఎన్నికలను అతిపెద్ద సవాల్ గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్... రేసు గుర్రాలపై ఫోకస్ పెట్టింది. ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. 119 నియోజకవర్గాల నుంచి వెయ్యి మందికిపైగా అప్లికేషన్స్ పెట్టుకున్నారు. ఇప్పటికే ఆయా దరఖాస్తులను పరిశీలించే పనిలో ఉంది కాంగ్రెస్ నాయకత్వం. అయితే భారీగా దరఖాస్తులు రావటంతో... అంతిమంగా టికెట్ ఎవరికి రాబోతుందనేది ఉత్కంఠగా మారింది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు నేతలు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వెయికి పైగా అప్లికేషన్స్ రావటంతో... టికెట్లకు భారీగా డిమాండ్ ఏర్పడినట్లు అయింది. ఇందులో చూస్తే కొందరు సీనియర్ నేతలు దరఖాస్తులు చేసుకోకుండా... తమ వారసులతో చేయించారు. పలువురు ముఖ్య నేతలు ఇతర నియోజకవర్గాల నుంచి టికెట్లు ఆశిస్తున్న పరిస్థితి ఉంది. ఇదిలా ఉంటే కొందరు నేతలకు హ్యాండించేలా కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ తరపున టికెట్ ఎవరికి దక్కుతుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. 50 -70కి పైగా నియోజకవర్గాల్లో పెద్దగా ఇబ్బందులు లేనప్పటికీ... మిగతా స్థానాల్లో తీవ్రమైన పోటీ ఉంది. కొన్ని జిల్లాల్లోని నియోజకవర్గాల్లో చూస్తే... ఒక్క టికెట్ కోసం ముగ్గురు నుంచి నలుగురు నేతలు పోటీ పడుతున్నారు. రిజర్వుడు నియోజకవర్గాలకు భారీగా పోటీ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఇల్లందులో చూస్తే...36 అప్లికేషన్స్ రావటం ఆసక్తికరంగా మారింది. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన ముగించి... వచ్చేనెల రెండో వారంలో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా పోటీ ఉండే నియోజకవర్గాల అభ్యర్థులను చివరి వరకు ఆపే అవకాశాలు ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయికొన్ని నియోజక వర్గాలను చూస్తే? బాన్సువాడలో అత్యధికంగా 11 మంది దరఖాస్తు చేస్తున్నారు. జుక్కల్ టికెట్ కోసం నలుగురు అప్లికేషన్ పెట్టారు. ములుగు టికెట్ కోసం సీతక్క. పినపాక టికెట్ కోసం సీతక్క కుమారుడు సూర్యం దరఖాస్తు చేసుకున్నారు. నాగార్జునసాగర్ టిక్కెట్ కోసం జానారెడ్డి ఇద్దరు కుమారులు రఘువీర్‌రెడ్డి, జైవీర్ రెడ్డి దరఖాస్తు చెయ్యగా.. మిర్యాలగూడ టికెట్ కోసం పెద్దకుమారుడు రఘువీర్‌రెడ్డి మరో దరఖాస్తు చేశారు. ముషీరాబాద్ టికెట్ కోసం అంజన్‌కుమార్ యాదవ్, కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్ దరఖాస్తు చేశారు. ఎల్బీనగర్ నుంచి మధుయాష్కీగౌడ్ అప్లికేషన్ పెట్టారు. కోదాడ, హుజూరాబాద్ నుంచి సినీ నిర్మాత అప్పిరెడ్డి దరఖాస్తు చేశారు. ఇదే స్థానాలను కోరుతూ ఎంపీ ఉత్తమ్?కుమార్? రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అర్జీలు పెట్టుకున్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించి కేసీఆర్? సోదరుడు రంగారావు కుమార్తె రమ్యారావు, ఆమె కుమారుడు రితేష్‌రావు దరఖాస్తు చేశారు. మునుగోడు టికెట్ కోసం కృష్ణారెడ్డి, పున్నా కైలాస్ నేత అప్లికేషన్ పెట్టారు. జనగామ టికెట్ కోసం పొన్నాల, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పోటీ పడుతున్నారు. వరంగల్ పశ్చిమ టికెట్ కోసం రాజేందర్ రెడ్డితో పాటు జంగా రాఘవరెడ్డి కూడా ఆశిస్తున్నారు. మొత్తం ఎపిసోడ్ లో కొడంగల్, మంథని నియోజకవర్గాల నుంచి మాత్రం ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. ఆయా స్థానాల నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీదర్ బాబు బరిలో ఉండనున్నారు. వీరికి టికెట్ ఖరారైనట్లే చెప్పొచ్చు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసేందుకు ఎన్నారైలు చాలా మంది ఆసక్తి కనబరిచారు. ఇదిలా ఉంటే.. పార్టీలోని సీనియర్ నేతలైన జానారెడ్డి, వీహెచ్, గీతారెడ్డి, రేణుకా చౌదరితో పాటు కొందరు నేతలు దరఖాస్తు చేసుకోలేదు. జానారెడ్డి కుమారులు బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో చాలా మంది నేతలు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇంట్రెస్ట్ చూపుతున్నారని తెలుస్తోంది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల వేళ? కాంగ్రెస్ పార్టీ టికెట్ వ్యవహారంలో ఎలాంటి ట్విస్ట్ లు చోటు చేసుకుంటాయనేది చూడాలి. ఇక ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలకు చివర్లో టికెట్లు ఇచ్చే అవకాశం ఉంటుందా..? లేక వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్తారా అనేది ప్రశ్నగానే ఉంది..!

# అల్లం వెల్లుల్లి పేస్ట్ కాదు వేస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 28**

ఏ కూరలో అయినా అల్లం వెల్లుల్లి తప్పనిసరిగా వేస్తుంటాం. అల్లం వెల్లుల్లి లేని మసాలా వంటకం ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకున్న ఓ ముఠా మనుషుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారు. విచ్చల విడిగా కల్తీ ఆహారపదార్థాలను తయారు చేస్తూ మార్కెట్లో చెలామణి చేస్తున్నారు. తాజాగా మరోసారి హైదరాబాద్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ బయటపడింది. రాజేంద్రనగర్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా తయారుచేస్తున్న కల్తీ అల్లం పేస్టు తయారీ గుట్టును రట్టు చేశారు పోలీసులు. ఉప్పరపల్లిలో ఒక మారుమూల ప్రదేశంలో అల్లం వెల్లుల్లి పేస్ట్ గోడౌను ఏర్పాటు చేశారు. ఉప్పరపల్లిలో దిల్దార్ అనే వ్యక్తి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేస్తూ పెద్ద ఎత్తున మార్కెట్లో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ౹౹ాౡ పోలీసులు పక్కా సమాచారంతో దాడులు చేశారు. ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం పేస్టును



తయారు చేస్తున్నట్టు గుర్తించారు. కెమికల్స్‌తో పాటు యాసిడ్, కుళ్లిపోయిన పేస్టును ప్యాకింగ్ చేసి ఎక్స్‌పైరీ డేట్ మార్చి అమ్ముతున్నట్టు దాడుల్లో బయటపడింది. ఈ దాడుల్లో 4 టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును సీజ్ చేశారు పోలీసులు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న ముఠాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. మార్కెట్లో చీప్‌గా దొరుకుతుంది కదా అని ఏడితే దాన్ని కొనుక్కోవద్దని సూచిస్తున్నారు అధికారులు. కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యాలతో వ్యాపారం చేస్తున్నారు దుర్మార్గులు.

# నిన్న కేసీఆర్... ఇవాళ హరీష్ రావు

## పంచాయితీల ఏకగ్రీవ తీర్మానాలు

**మెదక్, ఆగస్టు 28**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల హడావిడి నెలకొంది. ఇంకొక మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తుంది. రాష్ట్రంలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లలోని ఆయా పార్టీల ప్రతినిధులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఇప్పటి నుండే నానాపాట్లు పడుతున్నారు. కానీ ఆ నియోజకవర్గంలో ఉన్న ఆ నేత మాత్రం ఏ ప్రయత్నాలు చేయకుండానే అక్కడి ప్రజలు ఆయన చేసిన అభివృద్ధిని గమనించి, తామంత తాముగా ఎన్నికలకు మూడు నెలలు ముందు నుంచే తమ మద్దతును తెలుపుతున్నారట ఇంతకి ఎవరా నేత? వివరాలు పూర్తిగా తెలుసుకుందాం..అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్.. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే మాస్ లీడర్.. ఆయనే హరీష్ రావు. ఇప్పుడు సిద్దిపేట నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి హరీష్ రావుకి మద్దతుగా ఏకగ్రీవాల ట్రెండ్ నడుస్తోందట. అభివృద్ధికి హద్దులు లేవు అన్న విధంగా, బుల్లెట్ లా దూసుకుపోతోంది సిద్దిపేట నియోజకవర్గం. గత కొన్నేళ్లుగా సిద్దిపేట నియోజకవర్గం నుంచి మంత్రి హరీష్ రావు పోటీ చేస్తున్నారు. ఈసారి కూడా ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా హరీష్ రావుని కేసీఆర్ ప్రకటించారు. దాంతో ఆ నియోజకవర్గంలో ఉన్న పలు గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాదు.. హరీష్ రావును గెలిపించుకునే బాధ్యతను నియోజకవర్గ ప్రజలు తీసుకుంటున్నారు. ఆయనకు స్వచ్ఛందంగా తమ మద్దతును ఇస్తామంటూ ముందుకు వస్తున్నారు. అవును, సిద్దిపేటలో అప్పుడే ఎన్నికల హడావిడి మొదలైంది. సిద్దిపేట అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే.. మంత్రి హరీష్ రావుతోనే జరిగింది అంటున్నారు అక్కడి ప్రజలు. అందుకే తామంతా బిఆర్ఎస్ కే.. మా హరీష్ అన్నతోనే ఉంటామని ఏకగ్రీవంగా ముక్త కంఠం తో నినదిస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో ఒక గ్రామం ఏకగ్రీవ తీర్మానం చేయగా పలు గ్రామాల్లో కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. సిద్దిపేటలో నియోజకవర్గ పరిధిలో పోటీలో ఎవరు ఉన్న, తమ మద్దతు మాత్రం హరీష్ రావుకే అని మరోసారి సిద్దిపేట ప్రజలు నిరూపించారు. మంత్రి హరీష్ రావుకి ఏకగ్రీవ తీర్మానాలు అందజేస్తున్నారు. ఒక వైపు గ్రామాలు.. మరో వైపు పలు గ్రామాల్లో కుల సంఘాలు ఏకతాటి పైకి వచ్చి మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ పార్టీకి జై కొడుతున్నారు. ఇప్పటికే సిద్దిపేట రూరల్ మండలంలోని రాంపూర్ గ్రామం మొత్తం వచ్చే ఎన్నికల్లో మంత్రి హరీష్ రావుకే తమ మద్దతు అని ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆ పత్రాన్ని మంత్రి హరీష్ రావుకి అందజేశారు. మరో వైపు చిన్న గుండవెల్లి గ్రామ మత్స్య కారుల సహకార సంఘం, ముదిరాజ్, ఇరుకోడ్ గ్రామ ముదిరాజ్ సంఘం, సిద్దిపేట పట్టణంలోని హనుమాన్ నగర్ ముదిరాజ్ సంఘం మొత్తం మంత్రి హరీష్ రావుకి జై కొట్టారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలోని రజక సంఘం, మున్నూరు కాపు సంఘం, రావురుకుల గ్రామంలోని కుర్మ సంఘం మంత్రి హరీష్ రావును కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా తీర్మాన పత్రాలను మంత్రి హరీష్ రావు గారికి అందజేశారు. తమ గ్రామాలను అభివృద్ధి చేస్తూ.. తమ కుల సంఘాల బాగు కోసం ఆలోచించే మంత్రి హరీష్ రావు వైపే, బీఆర్ఎస్ పార్టీ వైపే ఉంటామని అంటూన్నారుఈ ఏకగ్రీవ తీర్మానాల పరంపర కొనసాగుతునే ఉంది.. అందరం ఒకే మాట.. ఒకే బాట అంటూ మేమంతా బీఆర్ఎస్ తోనే, మంత్రి హరీష్ రావుతోనే.. అంటున్నారు పలు గ్రామాల ప్రజలు. ఇలా ఏకగ్రీవ తీర్మాణాలు చేస్తున్న ప్రజలను చూసి మంత్రి హరీష్ రావు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'మీరు చూపించే అభిమానం, ఆప్యాయత తనపై మరింత బాధ్యత పెంచుతుంది. సిద్దిపేట ప్రజలే నా కుటుంబం. వారికోసం మరింత శ్రమిస్తాను.' అని చెప్పారు మంత్రి హరీష్ రావు. ఇలా సిద్దిపేట నియోజక వర్గంలో ఏకగ్రీవ తీర్మానాల పర్వం మరోసారి మొదలైంది. సిద్దిపేట ప్రజల ఆదరణ.. ఆప్యాయతను గుండెల్లో పెట్టుకుంటానని మంత్రి హరీష్ రావు చెప్పారు. ఏకతాటి పై వచ్చి ఏకగ్రీవంగా తీర్మానాలు చేయడం అనేది అభివృద్ధి.. బిఆర్ఎస్ పార్టీపై నమ్మకానికి నిదర్శనమన్నారు మంత్రి హరీష్ రావు.

# ఆసియా కప్ కు అంతా సిద్ధం

**ముంబై, ఆగస్టు 28**

క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. మరో రెండు రోజుల్లో ఆసియా కప్ 2023 ప్రారంభం కానుంది. ఆగష్టు 30వ తేదీన ఆరంభ పోరులో ఆతిధ్య పాకిస్తాన్ జట్టుతో నేపాల్ తలపడనుంది. ఇక ఈ టోర్నమెంట్‌కు హైలైట్‌గా మారిన భారత్, పాకిస్తాన్ హై-వోల్టేజ్ మ్యాచ్ సెప్టెంబర్ 2వ తేదీన జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీమిండియా ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఆసియా కప్ కోసం టీమిండియా జట్టు ఇప్పటికే బెంగళూరు క్యాంప్‌లో కఠోరంగా ప్రాక్టీస్ చేస్తోంది. ఇవన్నీ పక్కనపెడితే.. ఈ మెగా టోర్నీలో టీమిండియా తన మ్యాచ్‌లు.. శ్రీలంక పిచ్‌లపై ఆడనుంది. అక్కడి పిచ్‌లు స్లో మాత్రమే కాదు.. స్పిన్నర్లకు కూడా అనుకూలిస్తాయి. ఈ క్రమంలోనే ఆ పిచ్‌లపై కొందరు టీమిండియా బ్యాటర్ల గత రికార్డులు చెత్తగా ఉన్నాయి. వాళ్లు మరోసారి ఫ్లాప్ అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ టీమిండియా ఓపెనర్ బలహీనతలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. టర్నింగ్, పేస్‌కు అనుకూలించే పిచ్‌లపై గిల్‌కు చెత్త రికార్డు ఉంది. వెస్టిండీస్ పర్యటనలో అది కొట్టొచ్చినట్టు కనిపించింది. ముఖ్యంగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లకు తన వికెట్ సమర్పించుకుంటున్నాడు గిల్. సాధారణంగా గిల్ ఫ్లాట్ పిచ్‌లపై చెలరేగి ఆడతాడు. ఇక ఆసియా కప్‌లో.. అదీనూ శ్రీలంకలో ఫ్లాట్ పిచ్‌లు లభించడం చాలా కష్టం. ఈ టీమిండియా ఆల్‌రౌండర్ ప్రస్తుతం పేలవ ఫామ్ కొనసాగిస్తున్నాడు. బంతితో అడపాదడపా రాణిస్తున్నా.. బ్యాట్‌తో పెద్దగా ప్రభావం చూపించలేకపోతున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20ల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. స్లో పిచ్‌లపై హార్దిక్ పెద్దగా పరుగులు చేయలేకపోతున్నాడు. శ్రీలంకలో అన్నీ స్లో-పిచ్‌లు ఉండే అవకాశం ఉండటంతో.. హార్దిక్ ఫెయిల్ అయ్యే ఛాన్స్ ఉంది. ఈ ఇద్దరు ప్లేయర్స్.. ప్రస్తుతం గాయం నుంచి కోలుకున్నారు. పూర్తిగా ఫిట్‌నెస్ సాధించినప్పటికీ.. ఎలాంటి ప్రాక్టిస్ మ్యాచ్ ఆడకుండానే ఆసియా కప్‌లో ఆడనున్నారు. ఈ ఇద్దరూ ప్రధాన ఆటగాళ్లు కావడంతో.. ఎలా రాణిస్తారన్నది ఇప్పుడు అందరిలోనూ మెదులుతున్న ప్రశ్న. వన్డే ఫార్మాట్‌లో ఈ ఆటగాడు ఇప్పటికీ సరైన ప్రదర్శన ఇవ్వలేదు. పేలవ ఫామ్ కొనసాగిస్తున్నాడు. మరి ఆసియా కప్‌లో ఎలా ఆడతాడో చూడాలి. రోహిత్, కోహ్లీ.. మినహా మిగిలిన ప్లేయర్స్‌లో యెవరు ఎప్పుడు ఎలా ఆడతారో చెప్పడానికి కూడా కష్టమే. ఇక హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మకు తుది జట్టులో చోటు దొరకడం తక్కువే.

# క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయండి

**దేశ సమగ్రత, సమైక్యతను కాపాడండి**

**8వ జాతీయ రోజ్ గార్ మేళా లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్**




హాకింపెట్ నీసా అంతరిక్ష ఆడిటోరియంలో జరిగిన 8వ "రోజ్ గార్ మేళా" లో కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసారుఉ. సీఐఎస్ఎఫ్, సీఆర్పిపిఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎక్సీ్స గాల్లో మొత్తం 4శాఖల్లో ఉద్యోగాలు పొందిన 323 మంది అభ్యర్థులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అపాయింట్మెంట్ లెటర్స్ అందించారు

మంత్రి మాట్లాడుతూ నేడు జరిగిన 8వ రోజ్గార్ మేళాతో కలుపుకుని మొత్తం ఇప్పటివరకు 5లక్షల 50వేలకు పైగా మంది యువతకు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు అపాయింట్మెంట్ లెటర్లు అందజేశాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న రోజ్గార్ మేళాలో భాగంగా ఇవాళ అపాయింట్మెంట్ లెటర్లు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు. మీ తల్లిదండ్రులకు కూడా మన:పూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొన్న పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట నుంచి దేశానికి దిశా నిర్దేశం చేస్తూ.. వెయ్యి-1200 ఏండ్ల క్రితం నుంచే మన దేశంపై దాడులు జరిగాయి. ఎన్నో కుట్రలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా.. మన సంస్కృతి, సంప్రదాయాలు, మన కళలు ఇప్పటికీ అలాగే నిలిచి ఉన్నాయన్నారు. ఎందరు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. దేశ సమగ్రత చెక్కుచెదరలేదన్నారు. భారతీయుల్లో ఉన్నటువంటి జాతీయ భావన, యువతలో ఉన్నటువంటి దేశం కోసం, మన గడ్డ సమగ్రతను కాపాడేందుకు ఏదైనా చేయాలన్న సంకల్పమే కారణం. దేశ సేవలో మీరు భాగస్వామ్యులు కాబోతున్నారు. దేశ సమగ్రతను దేశ రక్షణకు మీరు అంకితం కాబోతున్నారు నేటి నుంచి మీరు అంకితభావంతో పని చేస్తూ దేశ సేవలో నిమగ్నమౌతారు. ఈ క్రమంలో మీరు ఓ డిసిప్లైన్ మోడ్ లో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్ద బడతారు అని నమ్ముతున్నాను. దేశం ఈ రోజు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమెరికా తో పాటు గౌరవాన్ని పొందుతున్నాం దానికి ఉదాహరణ మొన్న చంద్రాయన్ పై అడుగు పెట్టడమే అన్నారు. అందుకే మీలాంటి యువతకు సాధికారత కల్పించడం ద్వారా నాటి వైభవాన్ని పున:ప్రతిష్టించుకునేందుకు మోదీజీ సంకల్పించారు. మన దేశానికి.. స్పెషల్ అడ్వాంటేజ్ అయిన యువత సామర్థ్యాన్ని దేశం కోసం సద్వినియోగం చేసుకోవాలనేది మోదీ ఆలోచన. ఇందుకోసం అవసరమైన నైపుణ్యాన్ని కల్పించడంతోపాటు వారికి సరైన అవకాశాలు కల్పించడం మోదీ ఆలోచన. దానికి తగ్గట్లుగానే 9 ఏళ్లుగా.. ఒక్కొక్కటిగా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నాం.. వచ్చే 25 ఏళ్ల కాలం 'అమృత కాలం'. భారతదేశ చరిత్రలో ఇది అత్యంత కీలకమైన సమయం. ఈ సమయంలో.. మనలోని బానిస ఆలోచనలను తొలగించుకుని కేవలం జాతీయవాద భావనను మదిలో నింపుకుని యువత ముందడుగేయాలి.

కేంద్రం యువతకు ఓవైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తూనే.. మరోవైపు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని అందిస్తూ.. ఉద్యోగాలకోసం వేచి చూసే పరిస్థితినుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థితికి యువతను ప్రోత్సహిస్తున్నారు మన మోదీ. 22 అక్టోబర్ 2022 నాడు దేశ యువతకు దీపావళి కానుకగా 'రోజ్ గార్ మేళా'ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ప్రతి నెల 50నుంచి 70వేల మంది చొప్పున యువతకు అపాయింట్మెట్లు అందజేస్తూ ఈ మేళాను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తోంది. ఇది 8వ రోజ్గార్ మేళా, ఇవాల్టి కార్యక్రమంతో కలుపుకుని మొత్తంగా 5.5 లక్షలకు పైగా మందికి అపాయింట్మెంట్ లెటర్లు అందించామన్నారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా నిర్దేశిత సమయంలో చేరుకుంటాం. గతంలో ఉద్యోగాలంటే రికమండేషన్ ఉంటేనే వచ్చేది.. కానీ ఇవాళ రికమండేషన్ అవసరం లేకుండా.. టాలెంట్ ఉంటే ఉద్యోగం మీదే అన్నట్లుగా ఉంది పరిస్థితి. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అధునాతన సాంకేతికను విద్యావిధానంలోకి తీసుకొచ్చింది. అదే సమయంలో నెప్ -2020 ద్వారా విద్యావిధానంలో నైతికతకు, సృజనాత్మకతకు పెద్దపీట వేసిందని అన్నారు. ఇలా ఈ తొమ్మిదేళ్లలో చాలా మార్పులు వచ్చాయి. వచ్చే 25 ఏళ్ల అమృతకాలంలో.. మీరు మరింత శ్రమించి పనిచేస్తే.. భారతదేశాన్ని మళ్లీ 'విశ్వగురు'గా పనిచేయడం మరింత సులువు అవుతుంది. ఈ దిశగా మీ సహకారాన్ని ఆశిస్తూ. మరోసారి మీకు, మీ కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.

# డిక్లరేషన్ పై బీజేపీ సెటైర్లు

**హైదరాబాద్, ఆగస్టు 28**

చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభపై మంత్రి కేటీఆర్ విమర్శలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ కాంగ్రెస్ డిక్లరేషన్ సభపై సెటైర్లు వేస్తూ ట్వీట్ చేశారు. అసలు అది డిక్లరేషన్ సభేకాదని... కాంగ్రెస్ ఫ్రస్ట్రేషన్ సభ అని ఫైరయ్యారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో.. విజన్ లేని కాంగ్రెస్ ఇచ్చిన డజను హామీలు గాల్లో దీపాలేననే విషయం... చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలకు తెలుసని అన్నారు. కర్ణాటకలో కనీసం రేషన్ ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణకు వచ్చి డిక్లరేషన్ ఇస్తే నమ్మేది ఎవరంటూ ప్రశ్నించారు కేటీఆర్. గాడ్సేనే గెలుస్తాడన్న గ్యారెంటీ లేదు.. మీ 12 గ్యారెంటీలకు విలువ ఎక్కడిది అంటూ సెటైర్ వేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీలు వెనుకబడి ఉన్నారంటే దానికి కారణం.. కాంగ్రెస్ పార్టీనే అని, ప్రధాన దోషి ఆ పార్టీనే అని విమర్శించారు కేటీఆర్. కాంగ్రెస్ హయాంలో దళిత, గిరిజనలకు చేసిన పాపాలు.. ఆ పార్టీని మరో వందేళ్లు శాపంలా వెంటాడుతూనే ఉంటాయన్నారు. కర్ణాటకలో నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి పాలించే అర్హతే లేదన్నారు కేటీఆర్. అసలు కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో క్రెడిబిలిటీనే లేదన్నారు ఆయన. తెలంగాణ రాష్ట్రం అంటేనే.. దేశానికే ఓ పరిపాలనా పాఠమని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చిందని... ఇవ్వని హామీలెన్నో అమలుచేసింది ట్వీట్‌లో తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఏం చేశాయని యాన ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీకి చరిత్ర లేదని, కాంగ్రెస్‌కు భవిష్యత్తు అంతకన్నా లేదని కేటీఆర్ విమర్శించారు. చరిత్ర, భవిష్యత్తు ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే.. అని ట్వీట్ చేశారాయన.

# విస్టారా ఫ్లైట్‌లో సీపీఆర్

**బెంగళూర్, ఆగస్టు 28**

బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్తున్న విస్టారా ఫ్లైట్‌లో ఓ రెండేళ్ల చిన్నారికి అస్వస్థకు గురైంది. ఊపిరాడక ఇబ్బంది పడింది. ఆ ఫ్లైట్‌లోనే ఢిల్లీ ఏయిమ్స్ కి చెందిన ఐదుగురు డాక్టర్లు ప్రయాణిస్తున్నారు. వెంటనే చిన్నారి పరిస్థితిని గమనించారు. అప్పటికే చిన్నారి పల్స్ పోయింది. శరీరం పూర్తిగా చల్లబడిపోయింది. శ్వాస తీసుకోడమూ ఆగిపోయింది. విమానం గాల్లో ఉండగానే వెంటనే సీపీఆర్ చేశారు డాక్టర్లు. మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించి ఫ్లైట్‌ని నాగ్‌పూర్‌కి మళ్లిస్తున్నట్టు అనౌన్స్‌మెంట్ చేశారు. అప్పటిలోగా చిన్నారికి ప్రాణానికి ఎలాంటి ప్రమాదం రాకుండా ప్రాథమిక చికిత్స అందించారు. అందుబాటులో ఉన్న మెడికల్ డివైజ్‌లతోనే చిన్నారి ప్రాణం పోకుండా కాపాడారు. ఐవి క్యానులా తో చికిత్స చేశారు. మళ్లీ సాధారణ స్థితికి వచ్చి ఊపిరి తీసుకునేంత వరకూ చాలా సేపు శ్రమించారు. గుండెపోటు వచ్చిందని గుర్తించి వైద్యులు దాదాపు 45 నిముషాల పాటు మెడికేషన్ చేశారు. కాసేపటికి ఫ్లైట్ నాగ్‌పూర్‌కి చేరుకుంది. వెంటనే చిన్నారిని పీడియాట్రిషియన్‌కి అప్పగించారు. ఆంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనను ఢిల్లీ ఏయిమ్స్ ట్విటర్‌లో షేర్ చేసింది. రెండేళ్ల చిన్నారి ప్రాణాలను సీపీఆర్ తో కాపాడాం అంటూ ట్విటర్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టింది

# 5 రూపాయిలకు చేరుకున్న టమోట

**మైసూర్, ఆగస్టు 28**

కామన్ మ్యాన్‌కు గుడ్‌న్యూస్! రైతన్నకు బ్యాడ్ న్యూస్! మరికొన్ని రోజుల్లోనే టమాట ధరలుదారుణంగా పడిపోనున్నాయి. కిలో టమాట ఐదు రూపాయాలకే దొరుకుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే జరిగితే రైతులు నష్టపోయే అవకాశం ఉంది. అయితే మధ్యతరగతి వర్గాలకు మాత్రం ఊరట కలుగుతుంది. రెండు నెలల క్రితం టమాట ధరలు సంచలనం సృష్టించాయి. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ఆకాశాన్ని అంటాయి. కిలో టమాట రూ.300 వరకు పలికింది. కొందరు రైతులైతే లక్షల్లో ఆర్జించారు. అయితే సాధారణ మధ్యతరగతి పౌరుడు మాత్రం ఇబ్బంది పడ్డాడు. వంద రూపాయలు పెట్టినా ఐదు టమాటలకు మించి రాకపోవడంతో ఆందోళన చెందాడు. దాంతో పాటే పచ్చి మిర్చీ ఇతర కూరగాయలు పెరగడంతో జేబుకు చిల్లు పడింది. ఇంటి బడ్జెట్ పెరిగి పోయింది. వేసవిలో విపరీతంగా ఎండలు కొట్టడంతో టమాట దిగుబడి తగ్గిపోయింది. అదే సమయంలో కొన్ని చోట్ల అతి వృష్టితో టమాట పంట నాశనమైంది. మరికొన్ని చోట్ల వర్షాలు లేక తోటలు ఎండిపోయాయి. ఉత్తరాదిలో విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో వారం రోజుల్లోనే టమాట రూ.30 నుంచి 300కు చేరుకుంది.

ధరల్లో స్థిరత్వం తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నేపాల్ నుంచి టమాటను దిగుమతి చేసుకుంది. దక్షిణాది నుంచి ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా మార్కెట్లకు టమాటాలు తరలించింది .సాధారణంగా టమాట పంట మూడు నెలల్లో చేతికొస్తుంది. ఇప్పుడిప్పుడే మార్కెట్లకు అధిక స్థాయిలో టమాట వస్తోంది. దాంతో హోల్‌సేల్ ధరలు పడిపోతున్నాయి. మైసూర్‌లోని ఏపీఎంసీ మార్కెట్లో ఆదివారం కిలో టమాట రూ.14కు దిగొచ్చింది. శనివారం నాటి రూ.20 నుంచి ఆరు రూపాయలు తగ్గింది. ఇదే సమయంలో బెంగళూరులో కిలో టమాట రూ.30-35 వరకు పలుకుతోందిఈశాన్య రాష్ట్రాల్లో టమాట డిమాండ్ తగ్గిపోయింది. అలాగే ఉత్తరాదిలోనూ తక్కువ టమాట వాడుతున్నారు. దాంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మిగులు టమాట స్థానిక మార్కెట్లకు వస్తోంది. సరఫరా ఇలాగే ఉంటే మరికొన్ని రోజుల్లోనే కిలో ఐదు రూపాయలకు తగ్గిపోతుందని మైసూర్ ఏపీఎంసీ సెక్రెటరీ ఎంఆర్ కుమారస్వామి అంటున్నారు. ప్రతి రోజూ నిలకడగా 40 క్వింటాళ్ల టమాట వస్తోందని తెలిపారు. ఒకవైపు టమాట ధర తగ్గిందని సామాన్యులు సంతోషిస్తుంటే రైతులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఎస్సై రాజేంద్రన్ మాములోడు కాదు

**హైదరాబాద్, ఆగస్టు 28**

సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సై రాజేంద్ర అరెస్ట్ రిపోర్ట్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎస్సై రాజేంద్ర నుండి 1.7 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. మేధాక్వాలోన్ అనే డ్రగ్స్ ను రెండు ప్యాకెట్లలో పెట్టుకున్న అమ్మేందుక ప్రయత్నించగా వాటిని సీజ్ చేశారు పోలీసులు. ఒక ప్యాకెట్ లో 980 గ్రాములు, మరో ప్యాకెట్ లో 770 గ్రాముల డ్రగ్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తనకు ఒక నైజీరియన్ డ్రగ్స్ ప్యాకెట్ లు ఇచ్చినట్టు ఒప్పుకున్న ఎస్సై రాజేంద్ర .. ఒక సైబర్ క్రైం కేస్ నిమిత్తం ముంబై కి వెళ్లినప్పుడు.. ముంబై లోని ఖాందేశ్వర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో నిందితుడు నైజీరియన్ పట్టుకున్నారు. అక్కడి నుండి ట్రాన్సిట్ వారెంట్ మీద హైదరాబాద్ లు నైజీరియన్ ను తరలిస్తున్న క్రమంలో నైజీరియన్ తో కలిసి ప్లాన్ చేశాడు ఎస్సై రాజేంద్ర. తాను డ్రగ్స్ ప్యాకెట్లు అమ్ముతానని ప్యాకెట్లు తెచ్చుకున్న రాజేంద్ర.. చిత్రపురి కాలనీ కమాన్ వద్ద ఈ నెల 25 న డ్రగ్స్ ను బ్యాగ్ లో పెట్టుకుని బైక్ పై వెళ్లాడు. అయితే.. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు రాజేంద్రన్. దీంతో.. ఎస్సై రాజేంద్ర ను చేజ్ చేసి పోలీసులు పట్టుకున్నారు. రాజేంద్ర నుండి 50 లక్షలు విలువ చేసే సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు రిపోర్టులో పేర్కొన్నారు. అయితే.. రాష్ట్రంలో డ్రగ్స్ అణిచివేతకు ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో (టీన్యాబ్) నిఘాను పటిష్టం చేస్తూ డ్రగ్ విక్రేతల జాడను గుర్తిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి డ్రగ్స్ రాకుండా కట్టడి చేయడంతో పాటు స్థానికంగా డ్రగ్స్ విక్రయాలు చేసే వారిపై, వినియోగించే వారిపై కూడా ఫోకస్ పెట్టారు. తాజాగా.. సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సై రాజేంద్ర డ్రగ్స్ దందా చేస్తున్నట్లు గుర్తించిన టీన్యాబ్ అరెస్టు చేసింది.

# 'ప్రతినిధి 2' షూటింగ్ ప్రారంభం




హీరో నారా రోహిత్ పొలిటికల్ థ్రిల్లర్ 'ప్రతినిధి 2' తో గ్రాండ్ గా కమ్ బ్యాక్ ఇస్తున్నారు. వానర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సక్సెస్ ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ 'ప్రతినిధి' సిరీస్ నుండి రెండవ ఫ్రాంచైజీగా వస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ లో ప్రారంభమైయింది. హీరో నారా రోహిత్ పై కీలకమైన సన్నివేశాలని చిత్రీకరిస్తున్నారు. ప్రతినిధి 2 కోసం బిగ్ స్పాన్ వున్న కథను ఎంచుకున్నారు నారా రోహిత్. ఈ సినిమా ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యూరియాసిటీ పెంచింది.

కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, కొండకళ్ల రాజేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. యువ సంచలనం మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తుండగా, నాని చమిడిశెట్టి సినిమాటోగ్రాఫర్ గా పని చేస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటర్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్.

ఈ చిత్రం 2024 జనవరి 25న రిపబ్లిక్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాగణం: నారా రోహిత్



# 'రాజుగారి అమ్మాయి నాయుడుగారి అబ్బాయి" నుండి "ఐ లవ్ యు" లిరికల్ సాంగ్ విడుదల



తన్విక అండ్ మొక్షిక క్రియేషన్స్ పతాకంపై నూతన తారలు రవితేజ నున్న హీరోగా, నేహ జురెల్ హీరోయిన్ గా రూపొందుతున్న చిత్రం ' రాజు గారి అమ్మాయి - నాయుడు గారి అబ్బాయి'. సత్య రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి నిర్మాతలు రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు. యువ ప్రతిభావంతులు కలిసి రూపొందిస్తున్న "రాజుగారి అమ్మాయి నాయుడుగారి అబ్బాయి" చిత్రం నుండి యువత ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "ఐ లవ్ యు" లిరికల్ సాంగ్ విడుదలైంది.

ఈ పాట మధురమైన సంగీతం, చక్కని సాహిత్యంతో హృదయాలను ఆకర్షిస్తుంది. రెహమాన్ రచించిన ఈ చిత్ర గీతాన్ని యాజిన్ నిజర్, నూతన్ మోహన్ పాడారు. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం చేయటం విశేషం. "ఐ లవ్ యు" అనే పాట చిత్ర బృందం యొక్క అంకితభావం మరియు కృషికి నిదర్శనం. చిత్ర నాయికా నాయకులపై చిత్రీకరించ బడ్డ ఈ గీతం యువతరం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది."రాజుగారి అమ్మాయి నాయుడుగారి అబ్బాయి" చిత్ర కథాంశం, ఈ తరం సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది.

ఈ పాట విడుదలకు ముందే విడుదల అయినరాజుగారి అమ్మాయి నాయుడు గారి అబ్బాయి టీజర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకులలో ఈ సినిమాపై ఉన్న ఆసక్తిని రెట్టింపు చేయడానికి ఈ చిత్రం యొక్క ట్రైలర్ త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం కొద్ది రోజులలో థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధ మవుతోంది.

# "రాక్షస కావ్యం" సినిమా నుంచి రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ, రామ్ మిర్యాల పాడిన విలన్స్ ఆంథెమ్ రిలీజ్



వీన్ బేతిగంటి, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "రాక్షస కావ్యం". ఈ చిత్రాన్ని గరుడ ప్రొడక్షన్స్, పింగో పిక్చర్స్, సినీ వ్యాలీ మూవీస్ బ్యానర్స్ లో దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మిస్తున్నారు. నవీన్ రెడ్డి, వసుందర దేవి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఉమేష్ చిక్కు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. "రాక్షస కావ్యం" చిత్రాన్ని దర్శకుడు శ్రీమాన్ కీర్తి రూపొందిస్తున్నారు. సోమవారం ఈ సినిమా నుంచి విలన్స్ ఆంథెమ్ ను రిలీజ్ చేశారు.

కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించిన ఈ ప్రమోషనల్ సాంగ్ కు ఆర్.ఆర్ ధ్రువన్ ట్యూన్ కంపోజ్ చేశారు. ముగ్గురు టాప్ సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, రామ్ మిర్యాల, మంగ్లీ ఈ పాటను పాడారు. డీలో డిల్లెలో డీలో డిల్లెలో హీరో ఎవడు విలన్ ఎవడు జిందగీలో...డీలో డిల్లెలో డీలో డిల్లెలో..సెడ్డోడెవడు మంచోడెవడు బోలో బోలో...అంటూ మనుషుల వ్యక్తిత్వాలను ప్రశ్నిస్తూ అర్థవంతమైన లిరిక్స్ తో సాగుతుందీ పాట. విలన్స్ గురించి ప్రత్యేకంగా ఈ పాటను డిజైన్ చేయడం విశేషం.

మైథాలజీని నేటి సామాజిక పరిస్థితులకు అన్వయించి తెరకెక్కించిన ఒక కొత్త తరహా సినిమాగా "రాక్షస కావ్యం" ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు.

నటీనటులు - నవీన్ బేతిగంటి, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి, యాదమ్మ రాజు, శివరాత్రి రాజు, ప్రవీణ్ దాచరం, కోట సందీప్, విజయ్ అంబయ్య, వినయ్ కుమార్ పత్రి తదితరులు

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950